

ప్రాజెక్టు కట్టేందుకు ఎటువంటి అనుమతులూ లేవు.. అయినా అడ్డగోలుగా కట్టేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని.. పోలీసులతో భయపెట్టి.. మూడు కార్తెలు పండే తల్లిలాంటి భూములు లాక్కున్నారు. పైసా పరిహారం ఇవ్వకుండానే.. దౌర్జన్యంగా పట్టాదార్ పాస్‌పుస్తకాలూ తీసేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధమని ఎన్‌జీటీ అక్షింతలు వేస్తే ఇప్పుడు ప్రాజెక్టునే ఆపేశారు. ఇక అది ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు. సేద్యం చేయడానికి భూముల్లేక.. చేద్దామంటే కూలి పనులూ లేక నిర్వాసిత రైతులు విలవిలలాడుతున్నారు.



గతంలో ముమ్మరంగా జరుగుతున్న రిజర్వాయర్ పనులు (ఫైల్)

నాడు పంటలతో పొలాలు కళకళ..



నేడు పిచ్చిమొక్కలతో నిండిన పొలాలు..



పెద్దిరెడ్డీ.. దీన్నేమంటారు..?



అసంపూర్తిగా నిలిచిపోయిన ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు

- అనుమతుల్లేకుండానే ముదివేడు రిజర్వాయర్ నిర్మాణం
- నాటి మంత్రి మాటే వేదంగా..
- గుడ్డిగా పనులు చేసేసిన అధికారులు
- ఎన్‌జీటీ కన్నెర్రతో నిలిచిపోయిన ప్రాజెక్టు
- ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి
- భూములు కోల్పోయిన రైతులు గగ్గోలు
- ప్రాజెక్టు కోసం వారి పొలాల ఆక్రమణ
- పైసా పరిహారం ఇవ్వకుండానే..
- పాస్ పుస్తకాలు లాక్కున్న వైనం
- సేద్యానికి భూముల్లేవు.. చేయడానికి పనులూ లేవు
- ముదివేడు రిజర్వాయర్ బాధితుల ఆవేదన

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎక్కడైనా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలంటే పెద్దతతంగమే ఉంటుంది. పర్యావరణ అనుమతులు తప్పనిసరి. అయితే అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం చేపట్టిన ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఎటువంటి అనుమతులూ లేవు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే.. తమ సామ్రాజ్యంగా భావించే పుంగనూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఈ కుటుంబం మూడు ప్రాజెక్టులు నిర్మించాలని భావించింది. ఈ ప్రాజెక్టుల వల్ల ప్రజలకు ఉపయోగం ఉంటుందో ఉండదో అని కాకుండా.. తామెంత వెనుకేసుకోవచ్చనే ఆలోచనతోనే వీటిని తలపెట్టారని జనం ఆరోపిస్తున్నారు. అనుకున్నదే తడవుగా చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం నేతిగుట్టపల్లె వద్ద నిర్మిస్తున్న ఒక రిజర్వాయర్, సోమల మండలం ఆవులపల్లె వద్ద మరో రిజర్వాయర్, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట ముదివేడు వద్ద ఇంకో రిజర్వాయర్ నిర్మాణానికి నిర్ణయించుకున్నారు. పర్యావరణ అనుమతుల కోసం నేతిగుట్టపల్లె రిజర్వాయర్‌కు మాత్రమే జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)కి జగన్ ప్రభుత్వం దరఖాస్తు చేసింది. ఆ అనుమతులు రాకముందే ఈ రిజర్వా యర్ పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయి. ఒక టికెట్‌కు మూడు సినిమాలు అన్నట్లు.. ఈ దరఖాస్తుతోనే.. మిగిలిన రెండు రిజర్వాయర్ల పనులూ మొదలు పెట్టారు. రాష్ట్ర మంత్రిగా పెద్దిరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా ఆయన సోదరుడు ద్వారకానాథరెడ్డి, రాజంపేట ఎంపీగా ఆయన తనయుడు మిథున్‌రెడ్డి బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండీ.. నిబంధనలు తుంగలో తొక్కి.. అనుమతుల ఊసు లేకుండానే పనులు చేపట్టాలని ఆదేశించడంతో.. అధికారులు అదేమిటని అడగకుండా.. పెద్దిరెడ్డి మాటలే వేదవాక్కుగా భావించి.. గుడ్డిగా పనులు మొదలు పెట్టి... శరవేగంగా పూర్తి చేశారు. ఆవులపల్లె కేవలం జంగిల్ క్లియరెన్స్ పనుల వద్ద ఉండగా.. ముదివేడు రిజర్వాయర్ పనులు సుమారు 70 శాతం పూర్తయ్యాయి. అయితే అనుమతులు లేకుండా పనులు చేపట్టినందుకు.. అనుమతుల కోసం చేసుకున్న దరఖాస్తులో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చినందుకు.. ఈ పనులను నిలిపేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌జీటీ రూ.100 కోట్ల భారీ జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. దీనిని సుప్రీంకోర్టు సైతం సమర్థించింది.

పరిహారం ఇవ్వకుండానే 1,075 ఎకరాలు..

ముదివేడు రిజర్వాయర్ కోసం కురబలకోట మండలం ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె, బి.కొత్తకోట మండలం కొత్తఊరు గ్రామాల్లో భూములను ప్రభుత్వం సేకరించింది. పట్టా, ప్రభుత్వ, డీకేటీ భూములతో కలిపి మొత్తం 1075.81 ఎకరాలు ఇందులో ఉన్నాయి. ముదివేడు గ్రామం చౌటగుంటపల్లె, కొత్తపల్లె, శీతోళ్లపల్లె (శీతువారిపల్లె), నడింగడ్డలు పూర్తిగా రిజర్వాయర్ కింద మునిగిపోతాయి. సీతువారిపల్లెలో 45 ఇళ్లు, కొత్తపల్లెలో 35, చౌటగుంటలో 100 ఇళ్లలో 50, నేతాజినగర్‌లో 10 ఇళ్లు మునకలో పోతాయి. రిజర్వాయర్ మునకలో అప్పలమ్మచెరువు, శీతోళ్లపల్లె చెరువు, జమ్ముకుంట పోతాయి. ఈ చెరువుల కింద.. ఎటువంటి చీకూ చింతా లేకుండా ఏటా మూడు పంటలు పండించుకునే వాళ్లమని రైతులు ఆవేదన చెందుతున్నారు. పైసా నష్టపరిహారం ఇవ్వకుండానే తమకు కావలసిన భూములను కాంట్రాక్టర్లు రైతుల నుంచి లాగేసుకున్నారు. పనులు మొదలు పెట్టి.. భూముల్లో పెద్ద పెద్ద గుంతలు తవ్వి.. మట్టి తరలించారు. తమకు నష్టపరిహారం ఇచ్చేంత వరకు పనులు చేయవద్దని రైతులు అడిగితే పోలీసులతో బెదిరించారు. పనులు మొదలైన సుమారు రెండేళ్ల తర్వాత ఎకరాకు రూ.12.5 లక్షలు నష్టపరిహారం ఇస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఒక్క రైతుకు కూడా పైసా నష్టపరిహారం ఇవ్వలేదు. పైగా వారి నుంచి బలవంతంగా పట్టాదార్ పాసుపుస్తకాలు లాక్కున్నారు. ఆ భూములూ తీసేసుకున్నారు.. ఇప్పుడు ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. భూములు సేద్యానికి పనికిరాకుండా పోయాయి.. బయట పనులకు వెళ్లాలన్నా.. కూలి పనులు లేవు.. ఎలా బతకాలని రైతులు వాపోతున్నారు. ముంపునకు గురయ్యే సీతువారిపల్లెలో సుమారు 70 కుటుంబాలు ఉంటాయి. ఈ పల్లెలో దాదాపు ప్రతి రైతూ ఏదో ఒక విధంగా నష్టపోయేవారే ఉండడం గమనార్హం. అనుమతుల్లేకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టు సంస్థ, పనులు చేయించిన పెద్దిరెడ్డి కుటుంబం, అధికారుల పైన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అనుమతుల్లేకుండా పనులు చేయడం నేరమని తెలిసినా.. వాటిని పర్యవేక్షించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 'పచ్చగా బతుకుతున్న మా బతుకుల్లో.. నిప్పులు పోశారు.. మా రోదనలు.. వేదనల మీద డబ్బు మేడలు కట్టుకున్నారు. పెద్దిరెడ్డీ.. దీన్నేమంటారు' అని వారు నిలదీస్తున్నారు.

ఇప్పటికీ పరిహారం లేదు..



ఎకరాకు రూ.12.5 లక్షలు ఇస్తామని కలెక్టర్, ఆర్డీవో, ఇతర అధికారులు వచ్చి చెప్పారు. పదెకరాలు తీసుకున్నారు. అదనంగా ఇంకో ఎకరాలో డబ్బు ఇస్తామని చెప్పి మట్టి తోడేశారు. చెప్పిన నష్టపరిహారం ఇప్పటికీ ఇవ్వలేదు. డబ్బులిస్తామని మా దగ్గర పట్టాదారు పాసుపుస్తకం తీసేసుకున్నారు. పొలాల్లో మట్టి తోడేయడంతో ఇప్పుడవి సేద్యానికి పనికిరావు. మా ఊరు మునకలో పోతోంది. ఇల్లు కట్టిస్తామని చెప్పారు. కట్టించలేదు. కనీసం జాగా అయినా చూపించాలని అడిగితే.. అదిగో.. ఇదిగో అంటూ గడిపేశారు.

- మధుసూదన్‌రెడ్డి, శీతువారిపల్లె

చట్టవిరుద్ధంగా తీసుకున్నారు..



ముదివేడు రిజర్వాయర్ నిర్మాణానికి అనుమతి లేదని తెలిసీ చట్టవిరుద్ధంగా మా భూములు తీసేసుకున్నారు. పల్లెకు దారి లేకుండా చేశారు. పొలాల్లో మట్టి ఎత్తి పెద్ద పెద్ద గుంతలు చేశారు. మావి పది ఎకరాలు ప్రాజెక్టు కింద పోయాయి. నష్టపరిహారం కూడా ఇవ్వకుండా రైతుల నోళ్లు కొట్టడం అన్యాయం. పాలు అమ్ముకోవాలన్నా.. కష్టంగా ఉంది. వ్యాన్‌లు మా ఊరికి రావడం లేదు. మేమే రెండు కిలోమీటర్లు వెళ్లి పాలు పోసి వస్తున్నాం. ఈ ప్రభుత్వమైనా మమ్మల్ని ఆదుకోవాలి.

- శివశంకర్‌రెడ్డి, శీతువారిపల్లె

అధికారులు సంతకాలు తీసుకున్నారు..



అధికారులు మమ్మల్ని మండల ఆఫీసు దగ్గరకు పిలిపించి.. మా దగ్గర ఆరేడు పేపర్ల మీద సంతకాలు తీసుకున్నారు. నష్టపరిహారం ఇస్తారనుకున్నాం.. ఇవ్వలేదు. మా దగ్గర ఉండే పట్టాదార్ పాస్‌పుస్తకాలు కూడా తీసేసుకున్నారు. ఇప్పుడు ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి.. మా పాస్‌పుస్తకాలు మాకు ఇచ్చేయాలి. పొలాల్లో గుంతలు తవ్వడంతో.. పంటల సాగు అటుంచి.. కనీసం పశువుల మేతకు కూడా ఇబ్బందులు పడుతున్నాం.

- ద్వారకానాథరెడ్డి, శీతువారిపల్లె

చేనేత కుటుంబం ఆత్మహత్యపై విచారణ

ఒంటిమిట్ట, జూలై 26: మండల పరిధిలోని కొత్త మాధవరానికి చెందిన పాల సుబ్బారావు అనే చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని లోకేశ్ గతంలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై స్థానిక టీడీపీ నాయకుల ఫిర్యాదుతో ప్రభుత్వ యంత్రాంగం విచారణ చేపట్టింది. ఎస్‌బీ డీఎస్పీ సుధాకర్, కడప ఆర్డీవో వెంకటపతి ఆధ్వర్యంలో విచారణను ప్రారంభించారు. ఆత్మహత్యకు గల కారణాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. రెవెన్యూ అధికారులు రెవెన్యూ రికార్డులో ఉన్న భూమి ఎప్పుడు ఆన్‌లైన్ చేశారు, ఎప్పుడు తొలగించారనే దానిపై వివరాలను సేకరించినట్లు సమాచారం. ఆత్మహత్యకు మరేదైనా కారణాలు ఉన్నాయనే దానిపై విచారణ చేపట్టారు. అప్పట్లో పోలీసులపై విమర్శలు రావడంతో నారా లోకేశ్ ప్రత్యేకంగా కుటుంబాన్ని ఆదుకునేందుకు విచారణ మొదలుపెట్టినట్లు తెలుస్తుంది. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. ఆత్మహత్యకు గల కారణాలను ప్రభుత్వానికి నివేదించేందుకు విచారణ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ పురుషోత్తంరాజు, ఎస్‌ఐ మధుసూదన్‌రావు, ఆర్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.



చేనేత కుటుంబ సభ్యులను విచారిస్తున్న డీఎస్పీ, ఆర్డీవో, రెవెన్యూ అధికారులు

టమోటాల వెల్లువ



ములకలచెరువు మార్కెట్‌కు భారీగా వచ్చిన టమోటాలు

- ప్రతిరోజూ అమ్మకానికి 80 వేల క్రేట్‌ల కాయలు
- 50 లారీల కాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- ములకలచెరువు మార్కెట్‌లో కళకళ

ములకలచెరువు, జూలై 26: ములకలచెరువు వ్యవసాయ మార్కెట్‌ను టమోటాలు ముంచెత్తున్నాయి. ప్రతి రోజూ 70 వేల నుంచి 80వేల క్రేట్‌ల కాయలు అమ్మకానికి వస్తున్నాయి. ఇంత భారీ స్థాయిలో ములకలచెరువు మార్కెట్‌కు టమోటాలు అమ్మకానికి రావడం ఇదే ప్రథమం. మార్కెట్ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా టమోటాలు అమ్మకానికి రావడం విశేషంగా చెప్పవచ్చు. 20 రోజుల క్రితం వరకు ఇక్కడి నుంచి 15 నుంచి 20 వేల క్రేట్‌ల కాయలు మాత్రమే ఎగుమతి అయ్యేవి. ప్రస్తుతం 80 వేల క్రేట్‌ల కాయలు రవాణా అవుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో ఎండ తీవ్రత కారణంగా టమోటా సాగు భారీగా తగ్గిపోవడంతో దిగుబడి పడిపోయింది. వేసవి తరువాత రైతులు భారీగా టమోటా పంట సాగు చేయడంతో ప్రస్తుతం దిగుబడి వస్తోంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని రైతులు రికార్డు స్థాయిలో టమోటా పంటను సాగు చేశారు. ప్రస్తుతం టమోటాలు కోతకు వచ్చాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంతో పాటు పక్క జిల్లా అయిన శ్రీసత్యసాయి జిల్లా తకనల్లు మండలం నుంచి టమోటాలను రైతులు ములకలచెరువు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. భారీ సంఖ్యలో వాహనాలు టమోటాలను తీసుకురావడంతో శుక్రవారం మార్కెట్ కిక్కిరిసిపోయింది. ప్రధాన గేటు వరకు వాహనాలు నిలిచిపోయాయి. మార్కెట్‌లో వాహనాలు నిలుపుకునేందుకు స్థలం చాలక బయట రోడ్డు పక్కన నిలుపుకోవాల్సి వస్తోందంటే ఏ స్థాయిలో టమోటాలు వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

తగ్గుముఖం పట్టిన ధరలు

ములకలచెరువు మార్కెట్‌లో టమోటా ధరలు తగ్గుముఖం పట్టాయి. వారం రోజుల క్రితం రూ.1600 వరకు పలికిన బాక్సు ధర క్రమంగా తగ్గుతూ వస్తోంది. శుక్రవారం మార్కెట్‌లో నాణ్యతను బట్టి కిలో 22 కేజీల బాక్సు రూ.300 నుంచి రూ.650 వరకు పలికింది. కిలో రూ.13 నుంచి రూ.29.50 వరకు పలికింది. ఇక్కడి నుంచి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఢిల్లీ, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. అక్కడ ఈ టమోటాలకు డిమాండ్ ఏర్పడింది. 20 రోజుల క్రితం వరకు ప్రతి రోజూ ఇక్కడి నుంచి కేవలం 10 నుంచి 15 లారీల కాయలు మాత్రమే ఎగుమతి అయ్యేవి. అయితే ప్రస్తుతం టమోటాలు భారీగా అమ్మకానికి వస్తుండడంతో ఇప్పుడు ప్రతి రోజూ 50 లారీల కాయలు ఎగుమతి అవుతున్నాయి.

రెండో రోజూ భూబాధితుల వినతులు

- భూ కబ్జాలపైనే ఎక్కువ
- సమగ్ర విచారణ నిర్వహించి పరిష్కరిస్తామన్న సిసోడియా



మదనపల్లె సబ్‌కలెక్టరేట్ గేటు వద్ద బాధితులతో మాట్లాడుతున్న రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా

మదనపల్లెటౌన్, జూలై 26: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లోని రెవెన్యూ రికార్డులు దగ్ధమైన నేపథ్యంలో విచారణలో భాగంగా రెండోరోజు శుక్రవారం సైతం రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గురువారం సాయంత్రం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించగా 400 మంది తమ సమస్యలపై ఆయనకు అర్జీలు అందజేశారు. ఈ క్రమంలో శుక్రవారం మదనపల్లె నుంచి విజయవాడకు బయలుదేరిన సిసోడియాకు సబ్‌కలెక్టరేట్ గేటు వద్ద పెద్ద సంఖ్యలో బాధితులు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2లక్షల ఎకరాల భూమి ఫ్రీహోల్డ్ అయిందని, అందులో 4,500 ఎకరాలు రిజిస్ట్రేషన్ అయ్యాయన్నారు. జబర్దస్తీగా స్వాధీనం చేసుకున్న వాటిపై చాలా ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో డీకేటీ పట్టాలు, ఇళ్ల స్థలాలు ఉన్నాయన్నారు. వీటిలో కొన్నింటిపై కోర్టు కేసులు నడుస్తున్నాయని, అలా లేని వాటిలో సెక్షన్ 145 ప్రకారం కలెక్టర్ ఉత్తర్వులతో తిరిగి యజమానులు స్వాధీనం చేసుకునే ఉత్తర్వులు ఇవ్వవచ్చన్నారు. అలాంటి బాధితులకు పోలీసు రక్షణ ఇస్తారన్నారు. సబ్‌కలెక్టరేట్‌లో దహనం అయిన ఫైళ్లన్నీ రీక్రియేట్ చేస్తామని, వాటి తాలూకు ఫైళ్లు ఆయా మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లో ఒక కాపీ, కలెక్టరేట్‌లో ఇంకో కాపీ ఉంటాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఫైళ్ల దహనం కేసులో ఫోరెన్సిక్ సైన్సు ల్యాబ్ రిపోర్టు వచ్చాకే ఈ కేసులో మరింత పురోగతి వస్తుందని సిసోడియా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పాల్గొన్నారు.

సమస్యల ఏకరువు

అధికార బలమే అండగా, పేదలు, మధ్యతరగతి వారిని భయపెట్టి, బెదిరించి కోట్ల విలువైన భూములను కేవలం నామ్‌కే వాస్తే డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకున్న ఘనత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన అనుచరులకే దక్కింది. ఉదాహరణకు రూ.లక్ష విలువ చేసే భూమికి కేవలం రూ.10వేలు చెల్లించి బలవంతంగా రాయించేసుకున్నారు. అలాంటి ఘటనలు మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో కోకొల్లలు. ఈ క్రమంలో శుక్రవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్ వద్ద రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరి ఆర్పీ సిసోడియాకు పలువురు పెద్దిరెడ్డి భూబాధితులు వారి సమస్యలను ఏకరువు పెట్టారు.

సబ్ కలెక్టరేట్ ఉద్యోగులకు కాస్త ఉపశమనం

సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం సంఘటన తరువాత సోమవారం నుంచి రెవెన్యూ, పోలీసు అధికారుల విచారణలో వున్న 30మంది సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులకు శుక్రవారం కాస్త ఉపశమనం దక్కింది. సోమవారం విధులకు వచ్చిన సబ్‌కలెక్టరేట్ ఉద్యోగుల నుంచి మొబైల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆ మొబైల్ ఫోన్ల సీక్రెట్ లాకులు, ఉద్యోగుల ఇ-మెయిల్ అడ్రెస్‌లు, పాస్‌వర్డ్‌లు తీసుకున్న పోలీసులు ప్రతి మొబైల్‌ఫోన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నాలుగు రోజులు పాటు ఈ ప్రక్రియ సాగించిన పోలీసులు ఎట్టకేలకు శుక్రవారం 30మంది ఉద్యోగులను డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి వారి మొబైల్ ఫోన్లను అప్పగించారు. వారి నుంచి వేర్వేరుగా స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్నారు. తదుపరి ఏదైనా విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరు కావాలని నోటీసులు ఇస్తున్నారు. దీంతో నాలుగు రోజులుగా ఆందోళన చెందిన ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ప్రధాన అనుమానితులైన ఆరుగురిని మాత్రం పోలీసులు ఇంకా విచారణ చేస్తూనే వున్నారు.




పెద్దిరెడ్డి ప్రథమ బాధితుడిని నేనే..



పుంగనూరు మండలం పాలెంపల్లెలో పెద్దిరెడ్డి క్రషర్ పక్కన నేను అన్ని అనుమతులతో క్వారీ తీసుకున్నాను. రెండు నెలల పాటు అక్కడ డబ్బులు వెచ్చించి పనులు చేపట్టాను. వైసీపీ ప్రభుత్వం వస్తూనే పెద్దిరెడ్డి నా క్వారీలను అక్రమంగా సీజ్ చేసి నాపై కేసులు పెట్టారు. నేను పరారై బెయిల్ తీసుకొని రావాల్సి వచ్చింది. అయినా తలవంచక నేను జనసేనలో ఉండి వైసీపీ ప్రభుత్వంపై పోరాడాను. ఈ రాక్షస ప్రభుత్వం పోయి ఉమ్మడి కూటమి ప్రభుత్వం వచ్చింది. సామాన్య ప్రజలనే కాకుండా నాలాంటి వ్యక్తులపై కూడా కేసులు బనాయించారు. వారి పాపం పండింది, శిక్షలు అనుభవించక తప్పదు.

- గంగారపు రాందాస్‌చౌదరి, జనసేన నేత, మదనపల్లె

చేపల చెరువులను కూడా చెరబట్టారు..



పుంగనూరులో మత్స్యకారులకు జీవనం అందించే పుంగమ్మచెరువుతో పాటు నాలుగు చెరువులను పెద్దిరెడ్డి అనుచరులు అంతా కలసి మట్టికోసం ధ్వంసం చేశారు. బోటింగ్, వాకింగ్, ట్రాక్ పేరుతో ఆ చెరువుల్లో మత్స్యకారులు చేపలు పట్టకుండా కట్టడి చేసి మాకు అన్యాయం చేశారు. జెన్నల పొట్టకొట్టిన ప్రభుత్వం పడిపోయింది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పేరుతో 50 హెక్టార్లు, మట్టి కోసం 50 ఎకరాలు కబ్జా చేశారు. చెరువుల్లోకి నీళ్లు రాకుండా ఎగువన ఉన్న వంకలను కబ్జా చేశారు. దీనిపై 2023లో హైకోర్టులో కేసు కూడా వేశాము. ఇప్పటికైనా న్యాయం జరుగుతుందని సిసోడియా సార్‌కు విన్నవించాము.

- టి.కృష్ణమూర్తి, ప్రెసిడెంట్, శ్రీవెంకటేశ్వర ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ, పుంగనూరు

దౌర్జన్యంగా దారి కబ్జా చేశారు..



మాది కలకడ మండలం ఎనుగొండ పాలెం పంచాయతీ ఎగువపాలెం. నా భార్య పంకజాక్షి పేరుమీద 5.18 ఎకరాల డీకేటీ భూమి ఉంది. ఈ భూమికి దిగువన రైసుమిల్లు మాధవరెడ్డి భూమి కొన్నాడు. అతని భూమిలోకి దారి లేకుంటే మా భూమిలో దారి కావాలని అడిగాడు. మేము కుదరదంటే మాపై దౌర్జన్యం చేశాడు. కేసులకు భయపడి గతిలేక తక్కువ రేటుకే మా భూమిని మాధవరెడ్డికి దారికోసం అమ్మినాము.

- వెంకటరమణ, రైతు, ఎగువపాలెం, కలకడ మండలం

మర్రికుంటపల్లె వీఆర్వో అవినీతిపై ఏసీబీ విచారణ

- హైకోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు ఎస్ఐ స్థాయి అధికారుల రాక
- ఫిర్యాదు పూర్వాపరాలపై రోజంతా వివరాల సేకరణ

ఒక వైపు మదనపల్లె సబ్ కలెక్టరు కార్యాలయంలో అగ్గి రాజుకున్న ఘటన రెవెన్యూతో పాటు జిల్లా రాజకీయాల్లో సైతం ప్రకంపనలు సృష్టిస్తుండగా, మరోవైపు కలికిరి మండలంలోని మర్రికుంటపల్లె వీఆర్వో అవినీతి చర్యలపై ఏకంగా ఏసీబీ అధికారులు విచారణ చేపట్టడం చర్చనీయాంశమైంది. ఆది నుంచి వివాదాస్పదుడిగా వున్న మర్రికుంటపల్లె వీఆర్వో కృష్ణయ్య అవినీతి కార్యకలాపాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా రాష్ట్ర హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో కడప ఏసీబీ కార్యాలయం నుంచి వచ్చిన ఇద్దరు ఎస్ఐ స్థాయి అధికారులు శుక్రవారం రోజంతా విచారణ చేపట్టారు. ఎమ్మార్వో కార్యాలయంలో వివిధ రికార్డులను పరిశీలించారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు తిష్ట వేయడంతో అక్కడ కార్యాలయంలో ఎలాంటి సందడి లేకుండా బోసిపోయింది.

కలికిరి, జూలై 26: మండలంలోని మర్రికుంటపల్లె గ్రామానికి చెందిన సర్వే నంబరు 269/ఏలో తనకు రాబడిన 0.23 సెంట్ల పొలం తన పేరుతో మ్యుటేషన్ చేసి పాసు పుస్తకాలు మంజూరు చేయించాలని సోమల మండలం తిమ్మినాయునిపల్లె గ్రామానికి చెందిన సి.రాజు భార్య సి.కామాక్షి కలికిరి తహసీల్దారుకు దరఖాస్తు చేసుకుంది. దీనిపై విచారణ జరిపిన మర్రికుంటపల్లె వీఆర్వో కృష్ణయ్య టైటిల్ డీడ్, పాసుపుస్తకం మంజూరుకు పెద్ద మొత్తంలో డబ్బు డిమాండు చేశాడు. ఆయన డిమాండు మేరకు కామాక్షి రూ.5 లక్షలు అందజేసింది. అయినా పని జరగకపోవడంతో వీఆర్వోను పదే పదే సంప్రదించగా మరో రూ.లక్ష కావాలని డిమాండు చేశాడు. దీంతో కామాక్షి గత నెల 3వ తేదీన తనకు జరిగిన అన్యాయం గురించి కలెక్టరుకు, కలికిరి తహసీల్దారుకు ఫిర్యాదు చేసింది. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో వీఆర్వో తనను మోసగించాడని పేర్కొంటూ ఆమె నేరుగా రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించింది. కేసు విచారించిన న్యాయస్థానం ఈ మొత్తం వ్యవహారంపై క్షుణ్ణంగా దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా ఈ నెల 16న ఏసీబీ డైరెక్టర్ జనరల్‌ను ఆదేశించింది. మూడు వారాల్లోగా విచారణ నివేదికను సమర్పించాల్సిందిగా కూడా ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం విచారణ కోసం ఆగస్టు 6వ తేదీకి ఈ కేసును హైకోర్టు వాయిదా వేసింది. పర్యవసానంగా మొత్తం వ్యవహారంపై పూర్తి వివరాలు సేకరించేందుకు ఏసీబీ అధికారులు అన్ని కోణాల నుంచి దర్యాప్తు మొదలు పెట్టారు.

రెండు నెలలుగా విధులకు హాజరు కాని వీఆర్వో

కాగా మర్రికుంటపల్లె వీఆర్వో కృష్ణయ్య గత రెండు నెలలుగా విధులకు హాజరుకావడం లేదని తెలిసింది. దీంతో ఆయనను సబ్ కలెక్టరు కార్యాలయానికి సరెండరు చేస్తూ స్థానిక తహసీల్దారు ఉత్తర్వులిచ్చారు. సరెండరుకు సంబంధించిన వివరణ కోరాలని ప్రయత్నించిన సబ్ కలెక్టరు కార్యాలయానికి కూడా కృష్ణయ్య అందుబాటులోకి రాలేదని సమాచారం. ఈ లోగా కార్యాలయం ఫైళ్లు అగ్గిపాలు కావడంతో అప్పటి నుంచి కృష్ణయ్య సరెండరుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా కనపడలేదని అంటున్నారు. దీంతో ఉత్తర్వుల నకలును తిరిగి ఎమ్మార్వో కార్యాలయం నుంచి పంపించాల్సి వుంది.

ఆరు నెలల క్రితమే భారీ అవినీతి ఆరోపణలు

రెండేళ్ల క్రితం మర్రికుంటపల్లెలో విధుల్లో చేరినప్పటి నుంచే కృష్ణయ్య వ్యవహారాలు వివాదాస్పదంగా మారాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఆయన గ్రామంలో ఏకపక్షంగా వ్యవహరించాడనే ఆరోపణలున్నాయి. ఒక దశలో ఏడాది క్రితమే ఆయన్ను సరెండరు చేసేందుకు అధికారులు సిద్ధపడగా అప్పటి ఎమ్మెల్యే, ఎంపీలు కృష్ణయ్య జోలికి వెళ్లొద్దని గట్టిగా చెపినట్టు ప్రచారం జరిగింది. మరో దఫా కూడా ఇదే ప్రయత్నం జరిగినా చివరికి కృష్ణయ్య పంతమే నెగ్గుతూ వచ్చిందంటున్నారు. అధికార పార్టీ నాయకుల అండ చూసుకుని గ్రామంలో రైతుల వద్ద నుంచి భారీ స్థాయిలో వసూళ్లు చేశాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే ఆరు నెలల క్రితం తహసీల్దారుకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. చాలా భాగం వసూళ్ల వ్యవహారాలు మదనపల్లె చిత్తూరు బస్టాండు సమీపంలోని ఒక ఎరువుల దుకాణం వద్దే జరిగినట్లు కూడా బాధితులు ఆరోపించారు. 12 మంది రైతుల నుంచి దాదాపు రూ.15 లక్షలు వసూలు చేసిన జాబితాను వీరంతా తహసీల్దారుకు అందజేశారు. ఒక్కొక్కరు రూ.6 వేల నుంచి రూ.3 లక్షల 60 వేల వరకూ వీఆర్వోకు చెల్లించుకున్నారు.

సచివాలయంలో రాత్రి వేళ ఆ వ్యక్తి ఎవరో?


సచివాలయంలో కంప్యూటర్ సీటులో కూర్చుని ఉన్న వ్యక్తి

జమ్మలమడుగు, జూలై 26: 19, 20 వార్డుల సచివాలయంలో రోజూ రాత్రిళ్లు ఓ వ్యక్తి కంప్యూటర్ సీటులో ఉంటున్నాడు. ఈ విషయం ఆ ప్రాంతీయుల ద్వారా తెలుస్తోంది. రోజూ సచివాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడున్న సిబ్బంది విధులు నిర్వహిస్తారు. ఏదైనా ఎక్కువ పని ఉన్నప్పుడు ఆరు గంటల వరకు ఉంటున్నట్లు తెలుస్తోంది. అయితే రోజూ ఆ కార్యాలయంలో ఆయన రాత్రిళ్లు 10 గంటల వరకు ఉంటున్నట్లు తెలుస్తోంది. పనిచేస్తున్న ఉద్యోగి అయితే కంప్యూటర్ వర్కు చేస్తుంటాడు. కానీ అక్కడ పనిచేస్తున్న ఉద్యోగినా, లేక బయటి వ్యక్తా అనే అనుమానం స్థానికుల్లో ఉంది. గురువారం రాత్రి 10 గంటల వరకు సచివాలయంలో ఉన్నట్లుగా స్థానికుల ద్వారా తెలుస్తోంది. ఈ సమస్యకు సంబంధించి సచివాలయ అడ్మిన్ రమణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా రోజూ సచివాలయంలో రాత్రి సమయంలో విధులు ఎవరైనా నిర్వహిస్తున్నారా అని అడిగితే రాత్రిళ్లు ఎవరూ ఉండరని ఆయన తెలిపారు. ఒకవేళ ఎవరైనా సచివాలయంలో వచ్చి ఉంటే రాత్రి సమయాల్లో ఉండకూడదని చెప్పడం జరుగుతుందని ఆయన తెలిపారు.

తాళ్లపాక బ్రహ్మోత్సవాల్లో ఘనంగా పుష్పయాగం


సిద్దేశ్వర, చెన్నకేశవ స్వాముల పుష్పయాగానికి సిద్ధంగా ఉన్న పూలు

రాజంపేట, జూలై 26: తాళ్లపాకలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వాములకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పుష్పయాగంలో భాగంగా సిద్దేశ్వర, చెన్నకేశవ స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుల నడుమ స్వామివార్లకు పుష్పయాగం మహోత్సవాన్ని అత్యంత రమణీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్లపాక దేవాలయం ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గురుస్వామి, సర్పంచ్ గౌరీశంకర్, తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు, ఆర్.స్వామినాయక్, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, గ్రామ పెద్దలు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్సీ జకియాఖానం


నారా లోకేశ్‌తో శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం

రాయచోటిటౌన్, జూలై26: శాసనమండలి లాబీలో శుక్రవారం వైసీపీ ఎమ్మెల్సీ, మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటికే మంత్రి ఫరూక్‌తో భేటీ అయిన జకియాఖానం ఈ రోజు లోకేశ్‌బాబును కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చట్టసభలను బహిష్కరించినా జకియాఖానం మాత్రం మండలి సమావేశాలకు హాజరవుతున్నారు. త్వరలో ఆమె టీడీపీలో చేరుతున్నారంటూ వైసీపీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

ఇసుకను ఉచితంగా అందించడమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ రెవెన్యూ (ఎక్సైజ్) ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా

రాయచోటి (కలెక్టరేట్)జూలై26: ఇసుకను ప్రజలకు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ రెవెన్యూ (ఎక్సైజ్) ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం వారు అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత ఇసుక పాలసీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఉచిత ఇసుక పాలసీపై ఇచ్చిన జీఓ 43ని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు.జిల్లాలో వీలైనంత ఎక్కువ ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్, మైనింగ్ అధికారి రవి ప్రసాద్,నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక తరలించే వాహనాలు సీజ్

రాజంపేట, జూలై 26: అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న పలు వాహనాలను మన్నూరు పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. కొందరు మట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో మన్నూరు పోలీసులు వాటిని అదుపులోకి తీసుకున్నారు. జేసీబీ, నాలుగు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రవీంద్రనాథ్ తెలిపారు. కావున ఇసుక అక్రమంగా తరలించవద్దని అలా తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఖాజీపేట, జూలై 26: అక్రమంగా పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఖాజీపేట పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. శుక్రవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆమేరకు నిఘా పెట్టగా రెండు ట్రాక్టర్లను పట్టుకుని సంబంధిత అధికారులకు రెఫర్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులకు ముగ్గురు బాలుర అప్పగింత


పట్టుబడిన విద్యార్థులతో బద్వేలు ఎస్ఐ సత్యనారాయణ

చెన్నూరు, జూలై 26: ఇంటి నుంచి వెళ్లిన బాలురు హేమంత్‌కుమార్, దాయాల తరుణ్, గుణవర్ధన్‌ను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక లక్ష్మీనగర్ వాసి హేమంత్‌కుమార్, మరో ఇద్దరు స్నేహితులు 8వతరగతి చదువుతున్నారు. కాగా శుక్రవారం ఉదయం స్కూలుకు వెళుతున్నామని చెప్పి సైకిల్‌లో వెళ్లి సైకిలును రూ.700కు అమ్మి ఇంట్లో చెప్పకుండా వెళ్లారు. బాలురు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు పాఠశాలలో అడిగితే రాలేదనడంతో గాబరా పడిన తల్లిదండ్రులు చెన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాయుడు, కానిస్టేబుల్ వీరారెడ్డి బాలుర ఫోటోలను జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్లకు పంపించారు. దీంతో బద్వేలు సీఐ యుగంధర్‌కు సమాచారం అందడంతో ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందితో బద్వేలు బస్టాండు ఆవరణలో తనిఖీ చేపట్టారు. అక్కడ తప్పిపోయిన ముగ్గురు పిల్లలను ఎస్ఐ సత్యనారాయ ణ బాలుడిని గుర్తించి పట్టుకున్నారు. విషయాన్ని చెన్నూరు పోలీసులకు తెలపడంతో వారి తల్లిదండ్రులను రప్పించి అప్పగించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప (క్రైం), జూలై 26: స్థానిక ఆర్టీసీబస్టాండు సమీపంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చిన్నచౌకు ఎస్ఐ రఫి తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయసు 55 ఏళ్లు ఉంటాయన్నారు. ఇతర వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తిస్తే తమను సంప్రదించి మరింత సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 9121100520, 9121100521, 9121100522లకు ఫోను చేయాలన్నారు.

ఫుడ్ టెక్నాలజీ - ఉపాధి ఈజీ

ఇంజనీరింగ్‌కు దీటుగా కోర్సులు ● యువతకు పెరుగుతున్న ఆసక్తి

దేశవిదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు

పులివెందుల, జూలై 26: దేశ, విదేశాల్లోనూ ఫుడ్ టెక్నాలజీతోనూ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. కేంద్ర విభాగాల్లోనూ అనేక ఉద్యోగాలు పొందుతున్నారు. బీటెక్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఫుడ్ టెక్నాలజీ కళాశాల వివిధ కోర్సులు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా కల్పిస్తోంది. ముఖ్యంగా బీటెక్ అంటే కంప్యూటర్ సైన్స్, ఈఈఈ, సివిల్, మెకానికల్ తదితర కోర్సులు మాత్రమే ఉంటాయి. కానీ సైన్స్ అండ్ ఫుడ్ టెక్నాలజీలో చేసే కోర్సులు కూడా బీటెక్‌లోకి వస్తాయి. ఈ కోర్సులు పూర్తిచేసిన వెంటనే విద్యార్థినీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలుమెండుగా ఉన్నాయి. పులివెందుల వద్దనున్న సైన్స్ అండ్ ఫుడ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులకు వివిధ రాష్ట్రాలు, విదేశాల్లో సైతం ఉపాధి పొందారు.

రాయలసీమ ప్రాంత పరిశ్రమలకు సేవ చేయడానికి, ఉత్పత్తిపరంగా ఆహార తయారీ యూనిట్లను పెంచడానికి, ఫుడ్ టెక్నాలజీ రంగంలో మానవ వనరుల అవసరాలను తీర్చాలనే లక్ష్యంతో 2008లో ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పులివెందులలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలను ప్రారంభించారు. నాలుగేళ్ల బీటెక్ ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ కోర్సును



అందిస్తోంది. ఇటీవల కళాశాలకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) గుర్తింపు కూడా పొందింది. ఫుడ్‌ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఆహార భద్రత, నాణ్యత విశ్లేషణ, ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెట్‌లో స్పెషలైజేషన్ కలిగి ఉన్న అత్యుత్తమ ప్రభుత్వ అధ్యాపకులు, బోధన, ప్రదర్శనకు తగిన అత్యాధునికత మౌలిక సదుపాయాలున్నాయి. విద్యార్థులు పోటీ పరీక్షలు, ఉద్యోగాలకు ఎలా తయారు కావాలో అడ్వైజరీ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను ఎటర్‌ప్రెన్యూర్లుగా తయారు చేసేందుకు సెమిస్టర్ లాంగ్ ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ వంటి వర్క్ ఎక్స్‌పీరియన్స్ అవకాశాలను కళాశాల కల్పిస్తోంది.

ఎల్‌బీఐ సెంటర్ ఏర్పాటు

చిరుధాన్యాలు, పండ్లు ప్రాసెసింగ్ కోసం బెంగుళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ సౌజన్యంతో ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ సహకారంతో ఎల్‌బీఐ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్ ద్వారా రైతులకు, గ్రామీణ యువతకు, మహిళలకు, విద్యార్థులకు పలువర్క్‌షాపులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

దేశ విదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగాలు

కళాశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు ఆల్ ఇండియా గేట్ టెస్, ఆల్ ఇండియా కామన్ అడ్మిషన్ టెస్ట్, ఐకార్ - జేఆర్ఎఫ్, జీఆర్ఈ, టోఫెల్ వంటి పోటీపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి పలుదేశ, విదేశాల ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఈ కళాశాలకు చెందిన కొందరు విద్యార్థులు కెనెడా, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఆహార పరిశ్రమల్లో వివిధ విభాగాల్లో ఉద్యోగాలు సాధించారు. అమెరికా, ఫిన్‌లాండ్, దుబాయ్, మలేషియా వంటి దేశాల్లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ప్రోగ్రాం ద్వారా ఉచితంగా శిక్షణ పొందారు. కేంద్ర, రాష్ట్ర హార భద్రత అధికారులు, యూనివర్సిటీల్లో అధ్యాపకులుగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ప్రేమకుమార్, సందీప్‌కుమార్ పల్సిషాట్స్, ఇమ్రాన్, సారికలు ప్యారడైస్ ఫుడ్ కోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను ఏర్పాటుచేసి ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా రాణించారు.

విశేష అవకాశాలు



ఫుడ్ టెక్నాలజీ కోర్సు చదివిన వారికి ఆహార అనుబంధ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయి. బీటెక్ నాలుగేళ్ల ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ అందుబాటులో ఉన్నాయి. ఇంటర్‌మీడియేట్ ఎంపీసీ, బైపీసీ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులు. ఎంపీసీ పూర్తిచేసిన నాన్ ఫార్మర్స్ కోటా విద్యార్థులు ఏపీ-ఈఏపీసీఈటీలో ర్యాంకులు సాధించి ఏపీ స్టేట్‌కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) వెబ్‌సైట్ ద్వారా వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవాలి. బైపీసీ పూర్తిచేసిన విద్యార్థులు ఫార్మర్స్ కోటా, నాన్ ఫార్మర్స్ కోటా ద్వారా కౌన్సిలింగ్‌లో పాల్గొని ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ అడ్మిషన్ పొందవచ్చు.

డాక్టర్ ఎం.ఎస్.బేగ్, అసోసియేట్ డీన్,
ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, పులివెందుల

ఫుడ్ క్వాలిటీ అనలిస్ట్ అవుతా



ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో సమగ్ర పాఠ్యప్రణాళిక ఉండడం వలన ఆహార శాస్త్రం, నాణ్యత, ఆహార భద్రతకీలక అంశాలపై పట్టుసాధించాను. ఈరంగంలో నా ఆసక్తిని రేకెత్తించింది. ప్రస్తుతం లండన్‌లోని గ్రీన్‌విచ్ విశ్వవిద్యాలయంలో ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీని అభ్యసిస్తున్నాను. ఫుడ్ క్వాలిటీ అనలిస్ట్ అవుతాను. ఆహార ఉత్పత్తులు అత్యధిక భద్రత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రజారోగ్యానికి దోహదపడతాను.

ప్రభావతి, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరుజిల్లా

ఎఫ్ఎస్ఎస్ఏఐలో ప్రభుత్వ ఉద్యోగం సాధించా



ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల నుంచి పట్టా అందుకున్నాను. నేను ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్ ఫుడ్ సేఫ్టీ అండ్‌స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)ఉత్తర ప్రాంతీయ కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసర్‌గా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా. ప్రజల జీవితాల్లో అర్థవంతమైన మార్పులను తీసుకురావడం ద్వారా ప్రజలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతున్నందున ఉద్యోగం సంతృప్తినిస్తోంది. ఆహార భద్రతను కాపాడడంలో నావంతు ప్రయత్నం అందించడానికి కృషిచేస్తున్నాను.

కొప్పెర స్వప్న, నంద్యాల, నంద్యాల జిల్లా

కంట్రోల్ ఆఫీసర్‌గా ఉద్యోగం



నాయుడుపేటలోని ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. పోటీ పరీక్షలు, ఉద్యోగాలకు ఎలా తయారు కావాలో అడ్వైజరీ క్లాస్‌ల ద్వారా విశ్లేషిస్తున్నారు. విద్యార్థులను ఎటర్‌ప్రెన్యూర్లుగా తయారు చేసేందుకు సెమిస్టర్ లాంగ్ ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ అవకాశాలను కళాశాల కల్పిస్తోంది. పులివెందుల కళాశాల ప్రయోగశాలలో మంచి పరికరాలున్నాయి. అధ్యాపకులు ఇచ్చిన ప్రాక్టికల్ ఓరియెంటెడ్ టీచింగ్ వల్ల నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను.

విశ్వనాథరెడ్డి, మైదుకూరు, కడపజిల్లా

హైకోర్టు జస్టిస్‌ను కలిసిన బార్ అసోసియేషన్


హైకోర్టు జస్టిస్ భానుమతికి వినతి పత్రం అందజేస్తున్న కడప బార్‌అసోసియేషన్ నేతలు

కడప(రూరల్) జూలై 26: రాష్ట్ర హైకోర్టు జస్టిస్, జిల్లా పోర్ట్‌పోలియో జస్టిస్ భానుమతిని శుక్రవారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో కడప బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బి.గుర్రప్ప నాయుడు, ప్రధాన కార్యదర్శి కెనడి, ఉపాధ్యక్షులు సి. చంద్రమోహన్, నేతలు చిన్నయ్య, నాగభూషణం తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని న్యాయస్థానాల్లో ఉన్న సమస్యలను జస్టిస్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా జిల్లా కోర్టు సముదాయంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల స్థానాలను భర్తీచేయాలని, 2019లో డెమాలిష్ చేసిన స్థలంలో నూతన కోర్టుల సముదాయాన్ని నిర్మించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే చెప్పండి పరిష్కరిస్తామని జస్టిస్ అనడం సంతోషమన్నారు. అనంతరం జిల్లాలోని ఇతర బార్‌అసోసియేషన్ సభ్యులు కూడా జస్టిస్‌ను కలిశారు.

● జిల్లా కలెక్టర్‌కు విన్నపం

జిల్లా న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కలెక్టర్ టి. శివశంకర్‌కు రెప్రజెంటేషన్ ద్వారా వివరించారు. న్యాయవాదుల్లో చాలా మందికి హౌస్‌సైట్ లేనందువలన ప్రభుత్వమే అడ్వకేట్ మ్యూచువల్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వ భూమిని నామినల్ రేటుకు ఇచ్చి న్యాయవాదులకు హౌస్‌సైట్ ఇప్పించాలని కోరారు.

హైకోర్టు జస్టిస్‌ను కలిసిన జిల్లా ప్రధాన జడ్జి

హైకోర్టు జస్టిస్, జిల్లా పోర్ట్‌పోలియో జస్టిస్ భానుమతిని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, ఇతర న్యాయమూర్తులు కలిశారు. న్యాయ సంబంధిత విషయాలను వివరించారు.

అగ్రహారంలో చోరీ

ఖాజీపేట, జూలై 26: మేజర్ పంచాయతీ అగ్రహారంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. కుటుంబీల కథనం మేరకు గురువారం రాత్రి చినుకులు పడుతుండడంతో రేకుల షెడ్డులో నిద్రిస్తుండగా వెనుకవైపు నుంచి దొంగలు వాకిలి తొలగించి ఇంట్లో చొరబడి రెండు జతల కమ్మలు, బియ్యం బస్తా, కొద్దిమేర నగదు తీసుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాయమాటలతో ఆస్తులు రాయించుకున్నారు

ట్రస్ట్ పెద్దల నుంచి రక్షణ కల్పించండి ● డాడీహోం అనాథ పిల్లలకు న్యాయం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రాధా

ప్రొద్దుటూరు టౌన్, జూలై 26: మాయమాటలు చెప్పి డాడీహోం ఆస్తులు రాయించుకుని, డాడీహోం ఖాతాలో ఉన్న రూ.1.20 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లను తీసుకున్నారని ప్రస్తుత ట్రస్ట్ చైర్మన్ బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి, బీజేపీ నేత గొర్రె శ్రీనివాసులుపై రాజా ఫౌండేషన్ కేర్ అండ్ చెయిల్డ్ చారిటబుల్ ట్రస్టు మాజీ చైర్మన్ రాధా ఆరోపించారు. శుక్రవారం కడప, ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్‌లో వేర్వేరుగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ ట్రస్టుకు చెందిన ప్రభాకర్ మిమ్మల్ని చంపుతారని వారు భయభ్రాంతులకు గురిచేశారన్నారు. డాడీహోం ఆస్తుల డాక్యుమెంట్లలో ఏమి రాశారో తమకు చూపించకుండానే రిజిస్టర్ కార్యాలయంలో సంతకాలు పెట్టించుకున్నారన్నారు. అనాథ పిల్లల పట్ల ప్రతిపాదించిన డిమాండ్లపై మీకు న్యాయం చేస్తామని, మీ ఆశయాలను ముందుకు తీసుకెళతామని చెప్పి డాక్యుమెంట్లు చేతికి రాగానే తమను పక్కనబెట్టారని వాపోయారు. బీజేపీ నేత గొర్రె శ్రీనివాసులుకు ఆడవారితో ఎలా మాట్లాడాలో కూడా తెలియదని విమర్శించారు. గురువారం పూజా స్కూలుకు వచ్చిన ఆయనను అనాథ పిల్లలకు అన్యాయం చేశారని విమర్శిస్తే తనపై చెయ్యి ఎత్తాడని అసభ్యంగా మాట్లాడటమే కాకుండా మిమ్మల్ని ఈడ్చి పడేస్తానని ఆగ్రహించాడన్నారు. ఆయనపై ఫిర్యాదు చేయడానికి రూరల్ పోలీసు స్టేషన్‌కు పోతే కేసు పెట్టవద్దని బీజేపీ పెద్దల నుంచి బెదిరింపులు వస్తున్నాయన్నారు. తనకు, కవితకు మధ్య గొడవలు పెట్టారని, తమను నమ్మించి మాయమాటలు చెప్పి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డాడీహోం అకౌంట్‌లో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లలో రూ.20 లక్షలను డ్రా చేసి వారు తమ సంస్థలోకి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని ఆరోపించారు. బయటి ప్రాంతాల్లో చదువుతున్న పది మంది పిల్లలకు రూపాయి ఫీజు చెల్లించలేదన్నారు. డాడీహోం కిరాణా సరుకులు, మెడిసిన్ బిల్లులు చెల్లించలేదని వాపోయారు. రాజారెడ్డి హత్యలో తమ పాత్ర ఉందని బుశెట్టి రామమోహన్‌రావు ఆరోపించడం దారుణమన్నారు. తమను డాడీహోం నుంచి బయటకు పంపడానికి కుట్ర పన్నారని, అన్యాయంగా తమపైనే కేసు పెట్టించారని వివరించారు. రాజా ఫౌండేషన్ చైర్మన్ రాజారెడ్డి మరణంతో హోంలో వున్న 68 మంది మానసిక వికలాంగులు, పూజా ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో చదువుతున్న 400 మంది అనాథ పిల్లల జీవితాలు గాలిలో దీపాల్లాగా మారాయన్నారు. దీంతో డాడీహోంలో జరుగుతున్న విషయాలను చిన్నజియర్‌స్వామికి వివరించడానికి హైదరాబాదులో విష్ణుచింతన్‌స్వామిని కలిసి పది గంటలు నిరీక్షించినా స్వామిని కలిసే అవకాశం ఇవ్వలేదన్నారు. స్కూల్ కరెంటు బిల్లు రూ.14 వేలు చెల్లించాలని బుశెట్టి రామమోహన్‌రావుకు ఫోన్ చేస్తే విష్ణుచింతన్‌స్వామిని అడగాలంటారని, అటువంటప్పుడు ఆయన చైర్మన్‌గా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. డాడీహోం ఇన్‌చార్జి కిరణ్మయి మాట్లాడుతూ 16 ఏళ్లగా తాను ఇన్‌చార్జిగా పనిచేస్తున్నానని, రాజారెడ్డి ఉన్నప్పుడు ఎంతో సవ్యంగా జరిగాయని, నూతన కమిటీ వచ్చాకే సమస్యలు ఎదురయ్యాయన్నారు.

రూరల్ ఎస్ఐ చిరంజీవి వేధింపులు

రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ చిరంజీవి వేధింపులకు గురిచేశారని రాధా కన్నీటిపర్యంతమయ్యారు. విష్ణుచింతన్‌స్వామి , ఎస్ఐ చిరంజీవిని ట్రస్టు చైర్మన్ బుశెట్టి, గొర్రె శ్రీనివాసులు తమపైకి ఉసిగొల్పారని దీంతో ఆయన తమను రకరకాలుగా ఇబ్బంది పెట్టారని ఎప్పుడు పడితే అప్పుడు వచ్చేవాడని అర్ధరాత్రి, అపరాత్రి లేకుండా వచ్చి తమను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని ఆయన వేధింపులను గుర్తుకు తెచ్చుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఈవిషయంలో కలెక్టర్, ఎస్పీ డాడీహోం అనాథ పిల్లలకు సరైన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అనసూయ, అనాథ పిల్లలు పాల్గొన్నారు.

వలంటీరు నుంచి డబ్బు ఇప్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 26: మాయమాటలు చెప్పి తన డబ్బు కాజేసిన వలంటీరు నుంచి డబ్బు ఇప్పించాలని ఖాదరాబాదు వాసి అన్నదానం లత పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ వలంటీరు గోపీకిశోర్ అవసరం ఉందని చెప్పి తన నుంచి రూ.4,80,000 తీసుకున్నాడన్నారు. డబ్బు తీసుకున్న తర్వాత పెళ్లి చేసుకోమని అడిగితే వలంటీరు దాడి చేశాడని తెలిపారు. ఆ దాడిలో తలకు, దవడకు, కంటికి తీవ్ర గాయాలై హైదరాబాదులోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నానన్నారు. మరో మూడు ఆపరేషన్లు చేయాలని, తన డబ్బు ఇవ్వమంటే వలంటీరు స్పందించడంలేదని వాపోయారు. రూరల్ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తే ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా తన డబ్బు ఇప్పించి వలంటీరును అరెస్టు చేయాలని కోరారు.

వీఆర్‌కు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

కడప (క్రైం), జూలై 26: కడప వన్‌టౌన్ ఎస్ఐ జి.మధుసూదన్‌రెడ్డిని వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ నెల 20న రాత్రి రాజీవ్‌పార్కు సమీపంలో వాహనాల తనిఖీ సమయంలో నవదీప్ అనే యువకుడిపై లాఠీని ఝుళిపించి దాడి చేసిన సంఘటనలో ఎస్ఐని వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఉత్తర్వులను జారీ చేశారు. ఎస్ఐ చేసిన దాడిని పరిగణనలోకి తీసుకుని పోలీసుశాఖ తరపున క్రమశిక్షణ కింద ఈ చర్యలను తీసుకున్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

రాయచోటిటౌన్, జూలై 26: పాలిసెట్ కౌన్సిలింగ్ అనంతరం మిగిలిన సీట్లకు ఈ నెల 31వ తేదీన రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మిగిలి ఉన్న సీట్లను పదవ తరగతి పాసై పాలిసెట్‌కు అర్హత కలిగిన అర్హత లేని అభ్యర్థులచే స్పాట్ అడ్మిషన్స్ ద్వారా భర్తీ చేస్తామన్నారు. రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ, ఈఈఈ గ్రూపులు ఉన్నాయన్నారు. కావున, విద్యార్థులు ఈ నెల 31వ తేదీన నేరుగా రాయచోటిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చి ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించి ప్రవేశాలు పొందాలని సూచించారు. కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.5800లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.5050 చెల్లించి ప్రవేశం పొందాలని ఆయన తెలియజేశారు.

రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడి దృష్టికి.. రైల్వేకోడూరు సమస్యలు



పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరిస్తున్న కస్తూరి

రైల్వేకోడూరు(రూరల్), జూలై 26: నియోజకవర్గ సమస్యలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లినట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. శుక్ర వారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన ను కలిసి వెంకటగిరి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, ఆప్సా జ్యూస్ ఫ్యాక్టరీ, పట్టణంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం వంటి సమస్యలను వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లె జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాయుడోరి రమణయ్య యాదవ్, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు బొబ్బే ధన తదితర నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

రాయచోటి టౌన్, జూలై 26: ఈ నెల 29, 30, 31 తేదీల్లో మదనపల్లెలోని ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పట్టణంలో రైతు సంఘం నేతలతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వెలిగల్లు ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినా కాలువల నిర్మించకపోవడంతో భూములు బీళ్లుగా దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యలపై మదనపల్లె పట్టణంలో జరగనున్న రాష్ట్ర స్థాయి సదస్సుకు రైతులు,శ్రామికులు, కౌలు రైతులు, మేధావులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

రాయచోటిటౌన్, జూలై26: మహిళను చెట్టుకు కట్టేసి కొట్టి హింసించిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీ. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక సీపీఎ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటన ఆటవిక చర్య అన్నారు. . ఇప్పటికైనా పోలీసులు విచారించి దాడి చేసిన వారి మీద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గాయపడిన మహిళకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి రామాంజులు, నాయకులు బసిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, జూలై 26: పట్టణంలోని వీరభద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు శంకరయ్య, కృష్ణయ్యస్వామి వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకాల పూజల విశిష్టత తెలియజేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

దర్గా స్వామీజీ జయంతి ఉత్సవాలు

రామాపురం,జూలై 26: మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ సాయినగర్‌లోని సమర్థ సద్గురు దర్గా స్వామిజీ 94వ జయంతి సందర్భంగా శుక్రవారం భక్తులు కేక్ కట్ చేశారు. ఈ ఉత్సవాలకు హాజరైన భక్తులు స్వామి వారి సమాధికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

రాజంపేట, జూలై 26 : రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాల నుంచి రక్షణ లభిస్తుందని పట్టణ సిఐ మద్దెయ్య ఆచారి తెలిపారు. శుక్రవారం పాత బస్టాండ్ కూడలిలో వాహనాలు తనిఖీ చేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అతివేగంతో ప్రయాణించినప్పుడే ప్రమాదాలు సంభవిస్తాయని తెలిపారు.

అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయం



గాలివీడులో అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న ఎస్ఐ వెంకటప్రసాద్

రాయచోటిటౌన్, జూలై26: దేశ రక్షణ కోసం సైనికులు చేస్తున్న త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ బాలయ్య, శ్రీనివాస్‌కుమార్‌రాజు అన్నారు. కార్గిల్ విజయ్‌దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ గజపతిరాజు ఆధ్వర్యంలో కార్గిల్‌యుద్ధంలో పాల్గొన్న సైనికులు బసిరెడ్డి, విశ్రాంత సైనిక సంఘం అధ్యక్షుడు బాలాజీ, చలపతి, ఎస్.చలపతి, శేఖర్‌నాయుడు, నరసింహారెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1999 కార్గిల్ యుద్ధ సమయంలో భారత సైనికులు ప్రదర్శించిన ధైర్య సాహసాలు భారతదేశ రక్షణలో కీలకంగా మారాయన్నారు. నాటి సైనికుల అసమాన త్యాగాలు మనకు నిత్యం స్ఫూర్తిదాయకం అన్నారు.నాడు అమరులైన సైనికులను మనం నిత్యం ప్రేరణగా తీసుకోవాలని, కార్గిల్ లాంటి విపత్కర పరిస్థితుల్లో వీరోచిత పోరాట పటిమను కనపర్చిన ప్రతి ఒక్క సైనికుడికి జాతి యావత్తు నమస్కరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాయచోటి రూరల్ కన్వీనర్ నందగోపాల్, ప్రధాన కార్యదర్శి ధనుంజయ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మండల ప్రధాన కార్యదర్శి యోగాంజులు తదితర నాయకులు పాల్గొన్నారు.

గాలివీడు: స్థానిక బస్టాండు ఆవరణలో ఎస్ఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేట: మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు వెంకటరత్నం సైని కులతో ఉన్న పరిచయాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు రాజయ్య, సుకన్య, ఇంద్రావతి, సురేంద్ర, ప్రసాద్, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, వీడీ బాలశేఖర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ విగ్రహం కూడలిలో కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ కాశ్మీర్‌ను ఆక్రమించు కోవాలనే కుట్రతో పాకిస్తాన్ సైన్యం చేసిన దురాక్ర మణలను 1999 జులై 26న భారత సైన్యం ఆపరేషన్ విజయ్ పేరుతో తిప్పికొట్టిందన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నేతలు ఆదినారాయణ, వీవీ రమణ, పెను గొండ రమణ, పి.హరిప్రసాద్, తోట నగేష్, పి.సూర్య చంద్ర, పత్తిపాటి నవీన్‌కుమార్, మృగరాజు, రమణయ్య, కె.శ్రీనివాసులు, జీకే నాగరాజు, ఆర్టిస్టు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: కార్గిల్ యుద్ధ వీరుల స్మారక దినం సందర్భంగా మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పులపత్తూరి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో పలువురు సైనికులు స్వర్గస్తులయ్యారన్నారు.. జిల్లా బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు వాకచర్ల సుబ్బారావు, మండల అధ్యక్షుడు నాగినేని బాలసుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి సాయం శ్రీధర్, నాయకులు సాయిఆచారి, విజయ్‌కుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

గాలివీడు, జూలై 26: సీజనల్ వ్యాధులపైన ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి కొండయ్య వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన శుకవారం మండలంలోని నూలివీడు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పల్లెల్లో వైద్య సిబ్బంది పర్యటించి వివిధ వ్యాధులు ఉన్న వారిని గుర్తించి అవసరమైన వారికి అత్యవసర వైద్య సేవలను అందించాలన్నారు. లెప్రసీ కేసులను సకాలంలో గుర్తించి వైద్యం అందజేయాలని, లేని పక్షంలో వారికి శాశ్వత అంగవైకల్యం వస్తుందని హెచ్చరించారు. డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేసి లార్వా దశలోనే దోమలను నిర్మూలించాలన్నారు. టీబీ కేసులు, వారికి సంబంధించిన వారికి పొగతాగేవారికి బీసీసీ వ్యాక్సిన్ వేయించాలన్నారు. డయేరియా కేసులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికను, కాన్పుల గదిని, ఇన్‌పేషంట్ వార్డును, నిల్వ గదిని, వ్యాక్సిన్ రూమును పరిశీలించారు. రికార్డును, రిపోర్టులను తనిఖీ చేసి తక్కువ ఫర్‌ఫార్మెన్స్ ఉన్న వారిని మందలించారు. అనంతరం స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందుతున్న పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది స్రవంతి, సూపర్‌వైజర్ దేవేంద్రారెడ్డి, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్తు: డీఈవో



లక్కిరెడ్డిపల్లె: ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాతున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి



సంబేపల్లె: యూనిఫాం దుస్తులను పంపిణీ చేస్తున్న హెచ్ఎం తదితరులు

లక్కిరెడ్డిపల్లె, జూలై 26: పదో తరగతి, ఇంటర్ మీడియట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించినపుడే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలలోని ఏపీ మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. పాఠశాల పరిశుభ్రత, ప్రహరీ, ఎకో క్లబ్‌ల ఏర్పాటు, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థినుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు.. బోధనలో టెక్నాలజీ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ మీడియట్‌లో వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. స్కిల్ డే శిక్షా సప్తాహ్ కార్యక్రమంపై విద్యార్థులను ప్రశ్నించారు. 29వరకు శిక్షా సప్తాహ్ నిర్వహించాలని సూచిఅంచారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్స్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

సంబేపల్లె: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుంటే విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా సాంకేతిక నైపుణ్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుగా 50 చెత్త బుట్టలు పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రవిశంకర్, దేవప్రసాద్‌రెడ్డి, విజయసారధిరెడ్డి, మహబూబ్ బాషా, ఉమాదేవి, జోసెఫ్, విద్యార్థులు పాల్గొన్నారు. మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో మోడల్ పాఠశాలలో ఉండే వృత్తి విద్యలు, ఐటీ అండ్ ఆటోమేటివ్ తరపున లిబ్రే ఆఫీస్, ఎంఎస్ ఆఫీస్‌ల, కోడింగ్-డీకోడింగ్‌నేర్పించారు. భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దారు. చిత్రలేఖనం, రాష్ట్ర, దేశ పటాలను తయారు చేయించడం, థర్మోకోల్‌తో కొత్త కొత్త ప్రాజెక్టులు చేయించడం మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వృత్తి విద్య ట్రైనర్, భీమశేఖర్, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలివ్వకుంటే ఎలా?

● కలెక్టరేట్ వద్ద స్వచ్ఛభారత్ కార్మికుల ఆకలి కేకలు..



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు

రాయచోటి (కలెక్టరేట్) జూలై 26: ఏళ్ల తరబడి వేతనాలు చెల్లించకపోతే కుటుంబ పోషణ ఎలాగంటూ స్వచ్ఛభారత్ కార్మికులు శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ ముందు ఆందోళన చేశారు. జిల్లాలో దాదాపు 1500 మందికి 18 నెలలుగా వేతనాలు అందలేదని, కొన్ని ప్రాంతాల్లో రెండేళ్లనుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో పని చేయించుకుని అధికారులు తమను వేధించడంతోపాటు, ఇలాగైతే విధులకు రావద్దని సర్పంచుల ద్వారా బెదిరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకిచ్చే 6 వేలు జీతం కూడా సరైన సమయానికి ఇవ్వకపోవడంతో అప్పులు సపులు చేసి బతుకుతున్నారు. ఈ విషయాలపై గతంలో స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదన్నారు. తాము వేరే పనికి వెళ్లేందుకు సైతం అధికారులు అడ్డుపడుతూ , విధుల్లోనుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఈ విషయం మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌నాయక్, సురేంద్ర, ప్రమీల, రామాంజులు, వెంకటరమణ, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నీటి విడుదలను పరిశీలిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

సుండుపల్లె, జూలై26: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం ఝరికోన ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. బాహుదా నదికి ఇరువైపులా సాగునీటి ఇబ్బందులు ఉన్నాయని రైతులు చెప్పడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు నుంచి నదిలోకి నీటిని విడుదల చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు సాగునీటి సమస్య లేకుండా నదిలోకి నీటిని విడుదల చేసి తాత్కాలికంగా రైతు సమస్యలు పరిష్కారం అయ్యేలా ఏర్పాటు చేశామన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు శివకుమార్ నాయుడు, యర్రంరెడ్డి, నాగసుబ్బయ్య, సురేశ్‌నాయుడు, శివ, జనసేన నాయకురాలు రెడ్డిరాణి, వంటేరు రాజా, మాజీ ఎంపీటీసీ మోహన, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

రామాపురం, జూలై 26: మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సర్పంచ్ మునపాటి ధనలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ నాగమణి ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపల్లెలో పారిశుధ్య పనులు నిర్వహించారు. కొత్తపల్లె నుంచి గువ్వలచెరువు వరకు రోడ్డుకు ఇరువైపులా, నాయుని చెరువుకు వచ్చే సప్లై చానల్‌లో ఉన్న పొదలను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు.తిమ్మారెడ్డి, రమేశ్, రమణ, రాజా, శ్రీరాములు, భాస్కర్ పాల్గొన్నారు.

పెనగలూరు : నూతన సచివాలయం, రైతుభరోసా, పాత వెలుగు, ఉపాధిహామీ కార్యాలయాల చుట్టుపక్కల పిచ్చి మొక్కలను జేసీబీ సహాయంతో కార్యదర్శులు సుబ్బరాయుడు, సురేష్‌బాబు తొలగించారు. వర్షాలు కురుస్తుండడంతో మొక్కలను తొలగిస్తున్నట్లు తెలిపారు.

అంగన్వాడీల నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు



రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న సీడీపీవో సౌభాగ్యమ్మ

సుండుపల్లె, జూలై 26: అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని రైల్వేకోడూరు సీడీపీవో సౌభాగ్యమ్మ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అంగన్వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమస్యలు, పనితీరుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు తప్పనిసరిగా అందించాలని సూచించారు. అంగన్వాడీ ల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌష్టికాహార లోపం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను అంగన్వాడీలకు సమకూరుస్తుందని, సక్రమంగా అమలు అయ్యేలా చూసే బాధ్యత అంగన్వాడీలపై ఉందన్నారు. మాతృమరణాలు, శిశు మరణాలు తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చిన్నతనం నుండే ఆటలపాటలతో కూడిన విద్యను చిన్నారులకు అందేలా చూడాలన్నారు. కొన్ని అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జీ. రెడ్డివారిపల్లె, సుండుపల్లె అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త రజిని పాల్గొన్నారు.

పెనగలూరు: మండల పరిధిలోని బెస్తపల్లె, బుచ్చరెడ్డిగారిపల్లె గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పద్మావతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశా రు. పెనగలూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, కొండూరు సెక్టార్ సూపర్ వైజర్ నీరూపాక్షి పాల్గొన్నారు. తదనంతరం బెస్తపల్లె కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువు తనిఖీ చేసి రికార్డుల ప్రకారం జరిగాయా లేదా అని పరిశీలించారు.

జూనియర్ కళాశాల మంజూరు చేయండి

● నారా లోకేశ్‌ను కోరిన మంత్రి మండిపల్లి



లోకేశ్‌తో మాట్లాడుతూ వెళుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 26: పట్టణంలో ముస్లిం మైనార్టీలు అత్యధికంగా ఉన్న కొత్తపల్లి ఏరియాలో మైనార్టీ విద్యార్థుల సౌకర్యార్థం జూనియర్ కళాశాల మంజూరు చేయాలంటూ శుక్రవా రం రాష్ట్ర రాజధాని అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మున్సిపలిటీ పరిధిలోని కొత్తపల్లెలో సుమారు 25 వేలకు పైగా జనాభా ఉండగా, మైనార్టీ కుటుంబాలకు చెందిన ఆటో కార్మికులు, బీడీ కార్మికులు, దినసరి కూలీలు అధికంగా ఉన్నారన్నారు. ఆ ప్రాంతంలో 4 ఉర్దూ మీడియం పాఠశాలలు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు ఉన్నా, జూనియర్ కళాశాల దూరంగా ఉండడంతో మైనార్టీ విద్యార్థులు కూలీలుగా మారుతున్నారని వివరించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని కొత్తపల్లి ప్రాంతానికి జూనియర్ కళాశాలను మంజూరు చేస్తే మైనార్టీ పేద కుటుంబాలకు మేలు జరుగుతుందని మంత్రి వినతి పత్రం ద్వారా కోరారు.

అభివృద్ధి పనులకు సహకరించండి : ఎమ్మెల్యే శ్రీధర్



మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లె, జూలై 26 : అభివృద్ధి పనులకు సహకరించాలని మంత్రి నారా లోకేశ్‌ను కోరినట్లు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి పార్థసారథి విజయవాడలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రిని కలిసి ఈ మేరకు విన్నవించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు, ముక్కా సాయివికాస్ పాల్గొన్నారన్నారు. అలాగే రోడ్డు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో భేటీ అయి పలు అభివృద్ధి పనులపై చర్చించినట్లు వివరించారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, జూలై 26: సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగుల సంఘం అధికార ప్రతినిధి దాది శ్రీనివాసులు కోరారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం దివ్యాంగులకు చాల అన్యాయం చేసిందన్నారు. దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చాలా మంది దొంగ సర్టిఫికెట్లు పొంది దివ్యాంగ పెన్షన్లు తీసుకుంటున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకొని నిజమైన దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్,మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

రాయచోటి టౌన్, జూలై 26: పట్టణంలో దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుక్కే విశ్వనాథనాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుడు శంకర్‌నాయక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల నివారణ కోసం ప్రతి సాయంత్రం పట్టణమంతా ఫాగింగ్ చేయాలని కోరారు. మురుగు కాలువల ఆక్రమణలను తొలగించి, పూడిక తొలగించాలన్నారు. పట్టణ కేంద్రంలో ఉండేటువంటి చికెన్ సెంటర్లలో శుభ్రతపై చర్యలు తీసుకోవడంతో పాటు, హోటళ్లలో కల్తీ ఆహార పదార్థాల వినియోగాన్ని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

హెచ్‌ఆర్‌ఏను సవరించాలి

సిద్దవటం, జూలై 26 : 11వ పీఆర్‌సీలో భాగంగా హెచ్‌ఆర్‌ఏ స్లాబును 10 శాతం, 12 శాతం, 16 శాతానికి తగ్గించడంతో తమకు తీవ్ర నష్టం కలిగిందని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్తంభం బాలగంగిరెడ్డి ఆరోపించారు. సిద్దవటం, బాకరాపేట, ఎగువపేట, బెటాలియన్ జిల్లా పరిషత్ హైస్కూళ్లలో నిర్వహించిన యూనియన్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 12వ పీఆర్‌సీలో పాత హెచ్‌ఆర్‌ఏ శ్లాబులను పునరుద్ధరించాలని కోరారు. మార్చిలో నియమించిన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు నాలుగు నెలలైనా వేతనాలు అందలేదరు. ఎస్తుత విద్యావిదానాన్ని వీలైనంత త్వరగా సమీక్షించి మార్పులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్ఎండీ ఇలియాజ్‌బాషా, సిద్దవటం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణ, నరసింహులు, రామాంజనేయులు, రామలింగరాజు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

సంబేపల్లె, జూలై26: సంబేపల్లె మండలం శెట్టిపల్లెలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 1038లో ఒక ఎకరా ప్రభుత్వ భూమి. సర్వే నెంబర్ 672లో 70 సెంట్ల రస్తా పొరంబోకు, 673లో 2.06 ఎకరాల కుమ్మరి ఇనాం భూములను విక్రయించి ఇండ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. సర్వే నెంబర్లు 673లో 1.03 ఎకరాలు పిత్రార్జితం కాగా 1.03 ఎకరాలను డీకేటీ భూమిగా 2012లో కొంత మంది వ్యక్తుల పేరు మీద ఆన్‌లైన్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై వీఆర్‌వో నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా ఆర్ఎస్ఆర్ ప్రకారం రస్తా పొరంబోకు, ప్రభుత్వ భూమి, కుమ్మరి ఇనాం భూములుగా నమోదై ఉందన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఇండ్ల నిర్మాణాలు చేపట్టి వారికి నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు.

వ్యాసరచన పోటీలు

పెనగలూరు, జూలై 26 :మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగామండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కస్తూర్బాగాంధీ ఏపీ మోడల్‌స్కూల్, ఎన్ఆర్ పురం, పెనగలూరు ఉన్నత పాఠశాలల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు నేడు అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్, జడ్పీటీసీ మాజీ సభ్యుడుమైనార్టీ నాయకులు అహ్మద్ బహుమతులు పంపిణీ చేస్తారని తెలిపారు.

వైసీపీ అనుకూల అధికారులను బదిలీ చేయండి



టీడీపీ నేత జవహర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, జూలై 26 : వైసీపీ అనుకూల అధికారులను వెంటనే బదిలీ చేయించాలని మండల టీడీపీ నాయకులు హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ రాష్ట్ర నాయ కు డు జవహర్‌కు టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ, మండల క్లస్టర్ ఇన్‌చార్జి మామిళ్ల ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు పామూరు సుబ్రమణ్యం, విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. మండలంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, వాటికి నిధులు కేటాయించాలని సోమశిల వెనుకజలాల ద్వారా చెరువుకు నీరందించే పైపు లైనుకు మరమ్మతులు చేసి వెంటనే రైతులకు నీరందించాలని ఫిర్యాదు చేసినట్లు తెలి పారు. మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులను బదిలీ చేసి వారిపై విచారణ చేయాలని నారా లోకేష్ కార్యాలయ ఓఎస్‌డీకి ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకులు ఇప్పటికీ ల్యాండ్ సెటిల్‌మెంట్లు, ఇసుక అక్రమ దందా వంటివి మండల పోలీసుస్టేషన్‌లోనే చేస్తున్నారని వారు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బీటెక్ విద్యార్థులకు ఓరియంటేషన్

రాజంపేట, జూలై 26 : రాజంపేట మండల పరిదిలోని బోయనపల్లె స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీలో శుక్రవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్ రెడ్డి, యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ పలు అంశాలపై అవగాహన కల్పించారు. యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ ఎస్ఎన్ శివరామిరెడ్డి, డీన్ స్టూడెంట్ అఫైర్ డాక్టర్ ఎం.సుబ్బారావు, డీన్స్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌కాల్‌తో కూరగాయల సరఫరా

రైల్వేకోడూరు, జూలై 26: ఫోన్ కాల్ చేస్తే ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను డోర్ డెలివరీ చేస్తామని ఇన్‌స్టిట్యూషన్ బిల్డింగ్ ప్రాజెక్టు రిసోర్స్‌పర్సన్ బి. ఉషారాణి తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయం తో పండించిన కూరగాయలను ఏపీ కమ్యూనిటి మేనేజ్ నేచురల్ ప్రాజెక్టు ద్వారా విక్రయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసుకునే రైతులతో గిట్టుబాటయ్యే పంటలను సాగు చేయించి, ఉత్పత్తులకు 365 రోజుల పాటు ఆదాయం లభించేలా వనరులు చూపిస్తున్నామని తెలిపారు. ప్రతి సోమ, శుక్రవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణ, మిగిలిన రోజుల్లో బొజ్జావారిపల్లె, అనంతరాజుపేట, బంగ్లామిట్టలోఅమ్మకాలు ఉంటాయన్నా రు. పూర్తి వివరాలకు 9603272697 నెంబరులో సంప్రదించాలని కోరారు.

కుప్పం ఆర్డీవోగా శ్రీనివాసులురాజు

● భీమవరం నుంచి బదిలీ చేస్తూ ఉత్తర్వులు



కుప్పం, జూలై 26: కుప్పం ఆర్డీవోగా కొనుదూరు శ్రీనివాసులురాజును నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఆర్డీవోగా పనిచేస్తున్న ఈయన్ను కుప్పానికి బదిలీ చేశారు. కాగా, గతేడాది అక్టోబరులో కడప నుంచి భీమవరం వెళ్లిన శ్రీనివాసులురాజు ప్రస్తుతం బదిలీపై కుప్పం వచ్చారు. కుప్పం ఆర్డీవోగా పనిచేస్తున్న గోపల్లి శ్రీనివాసులును ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు సఫాయి కర్మచారి చట్టంపై సమావేశం

చిత్తూరు, జూలై 26: కలెక్టరేట్ సమావేశపు హాలులో శనివారం సఫాయి కర్మచారి చట్టం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరుగుతుందని షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారిణి రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 26: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. పుంగనూరులో 4.0, నగరి 3.2, పెనుమూరు 3.0, విజయపురం 2.4, పూతలపట్టులో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

29న నిధి ఆప్-కే-నికట్‌పై అవగాహన

చిత్తూరు కలెక్టరేట్, జూలై 26: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో భాగంగా ఈ నెల 29వ తేదీన స్థానిక గంగనపల్లిలోని క్యాంఫోర్డ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. చందాదారులు, పెన్షన్‌దారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు



గంజాయి దొంగలను అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ సీఐ సురేశ్‌రెడ్డి

పలమనేరు, జూలై26 : పలమనేరు- గుడియాత్తం రహదారిలో మండీపేట కోటూరు క్రాస్ వద్ద గంజా యి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఒక ద్విచక్ర వాహనం, రూ20 వేలు విలువ చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ సురేశ్‌రెడ్డి కథనం మేరకు.. బైరెడ్డిపల్లి మండలం చప్పిడిపల్లి పంచాయితీ మోట్లపల్లి గ్రామానికి చెందిన పునీత్‌రెడ్డి(22), బురిశెట్టిపల్లి గ్రామానికి చెందిన బంగి అనిల్‌కుమార్(21) గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వీరిని పలమనేరు కోర్టుకు తరలించారు. కాగా ఇదే కేసుతో సంబంధం ఉన్న గంగవరం మండలం మేలుమాయి కొత్తూరుకు చెందిన పులగూర కార్తీక్(22), పలమనేరు మండలం చెత్తపెంట గ్రామానికి చెందిన తలారి మణికంఠ(27), ఎల్లప్పగారి గణపతి (24) కోసం గాలిస్తున్నారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుళ్లు కె.క్రిష్ణమాచారి, ఈవీ దేవ రాజులు, కానిస్టేబుళ్లు మురళి, అల్తామాస్, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

టీటీడీ సీఈ నియామకాన్ని తప్పుబట్టిన హైకోర్టు

సీనియార్టీ పాటించాలని సూచన

తిరుమల, జూలై26(ఆంధ్రజ్యోతి): టీటీడీ చీఫ్ ఇంజినీర్(సీఈ) నియామకాన్ని ఏపీ హైకోర్టు తప్పుబట్టింది. సీనియార్టీకి అనుగుణంగా సీఈ నియామకం జరగాలని టీటీడీని ఆదేశించింది. సీనియార్టీ ఉన్నా తనకు చీఫ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పించలేదని, తనకన్న జూనియర్‌గా ఉన్న నాగేశ్వరరావుకు పదోన్నతి కల్పించారంటూ ఎస్ఈ సత్యనారాయణ గతంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గతంలో కోర్టు కూడా స్పందిస్తూ సర్వీస్ రూల్స్ అనుగుణంగా పదోన్నతి కల్పించాలని పలుమార్లు టీటీడీని ఆదేశించింది. అయితే నాగేశ్వరరావు ఫిట్ పర్సన్ అని, రికార్డ్స్ పరిశీలించి అతన్ని ఏకగ్రీవంగా సీఈగా ఎంపిక చేసినట్టు టీటీడీ కోర్టుకు వివరించింది. అయితే పిటిషన్‌దారు సమర్పించిన రికార్డులను పరిశీలించిన హైకోర్టు సత్యనారాయణ సీఈ పోస్టుకు అర్హుడని స్పష్టం చేసింది. డీపీసీ(డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) నియమనిబంధనలు పాటిస్తూ సత్యనారాయణను 2020 నుంచే సీఈగా పరిగణించాలని రెండురోజుల క్రితం తీర్పునివ్వడం టీటీడీకి చెంపపెట్టులా మారింది. ఇక సీఈ నియామకంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. చీఫ్ ఇంజినీర్‌గా తమకు అనుకూలమైన వ్యక్తి ఉంటేనే ఇష్టానుసారం వ్యవహరించవచ్చనే ఉద్దేశంతోనే గత ప్రభుత్వంలోని అధికారులు ఈ అక్రమ నియామకం చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కీలకమైన విభాగాల్లో తమకు అర్హత లేని వ్యక్తులను నియమించి వ్యవస్థను తప్పుదారి పట్టించారనే ఆరోపణలు వస్తున్నాయి. టీటీడీ చీఫ్ ఇంజినీర్ నియామకంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించి బాధ్యులైన వారిపై నూతన ఈవో శ్యామలరావు చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత నవీన్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

జగన్‌ని డ్రామాల రెడ్డిగా పిలుస్తాం : బీజేపీ



మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి అర్బన్, జూలై 26: మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఇకపై డ్రామాలరెడ్డిగా పిలుస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో జగన్ చేసింది ధర్నాలా లేదని, అచ్చం డ్రామాలాడుతున్నట్లు ఉందని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన దెబ్బకు మతిపోయిందన్నారు. రాష్ట్రపతి పాలన ఎప్పుడు విధిస్తారో తెలియని వ్యక్తి రాష్ట్రాన్ని ఎలా పాలించారో అర్థం కావడం లేదన్నారు. 'మీరు.. మీరు కొట్టుకు చంపుకుని.. ఆ నేరాన్ని కూటమిపై వేస్తారా?' అంటూ వైసీపీ శ్రేణులపై ఆగ్రహించారు. ప్రభుత్వం ఏర్పడి 44రోజులే అయ్యిందని అప్పుడే విమర్శలు చేయడం తగదన్నారు. వికసిత్ ఆంధ్రాకు అడుగులు పడుతున్నాయని, సీమాంధ్రను స్వర్ణాంధ్రగా మారుస్తామన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు కాల్చితే దోషులు తప్పించుకోలేరని, 956ఎకరాలు కాజేసిన పాపాల పెద్దిరెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తేలేదన్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణాన్ని త్వరలో ఆధారాలతో సహ బయటపెడతామని స్పష్టం చేశారు. అజయ్‌కుమార్, వరప్రసాద్, జీవన్‌రాయల్, సుబ్బుయాదవ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు

తిరుమల, జూలై26(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.55 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 61,699 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 25,082 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

'డాయ్ యాప్'లో ఆర్పీలే కీలకం

● వీళ్లే డిపాజిట్లు కట్టించారంటున్న బాధితులు ● సెలవులో మెప్మా ఉద్యోగి రాజేష్
● మోసంపై సీఐకి పలువురి ఫిర్యాదు



సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేస్తున్న డాయ్ యాప్ బాధితులు

పలమనేరు, జూలై 26: పలమనేరు ప్రాంతంలో దాదాపు రూ.100 కోట్ల వరకు ప్రజలకు కుచ్చుటోపి పెట్టిన 'డాయ్ యాప్' ఘటనలో మున్సిపాలిటీ పరిధిలో పలువురు ఆర్పీలే కీలక పాత్ర పోషించారని బాధితులు అంటున్నారు. మెప్మా కార్యాలయంలో రాజేష్ అవుట్‌సోర్సింగ్‌గా పనిచేస్తూ పలువురు ఆర్పీలతో సన్నిహితంగా ఉంటూ ఈ తతంగం నడిపించినట్లు తెలుస్తోంది. రాజేష్ సూచనల మేరకు వీరంతా మహిళల వద్ద డాయ్ యాప్‌లో డిపాజిట్లు కట్టించినట్లు సమాచారం. తమ గ్రూపులకు సంబంధించి రుణాల కోసం కొందరు ఆర్పీలను కలిస్తే.. డిపాజిట్ చేస్తే గాని రుణాల మంజూరుకు బ్యాంకులకు దరఖాస్తులు పంపబోమని ఒత్తిడి తెచ్చినట్లు విమర్శలున్నాయి. మున్సిపాలిటీలో దాదాపు 800కు పైగా స్వయం సహాయక సంఘాలు ఉండగా వీటి నిర్వహణ కోసం 42 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. కాగా, ఈ ఘటనలో మూల సూత్రధారి అయిన మెప్మా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రాజేష్ కనిపించకుండా పపోయాడు. దీనిపై అధికారులను విచారించగా గురు, శుక్రవారాలు సెలవుపెట్టారని చెప్పారు. కాగా, డాయ్ యాప్‌ను పరిచయం చేసిన రాజేష్‌కు మరికొందరు సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అతడికి సన్నిహితంగా ఎవరెవరు ఉన్నారనే వివరాలను సేకరిస్తున్నారు. రాజేష్‌కు అత్యంత సన్నిహితంగా రాజేష్ అనే పేరున్న మరో వ్యక్తి ఉన్నాడని, అతడికి పట్టణంలో మరో అసాంఘిక వ్యాపారంలో ఉన్నాడని చెబుతున్నారు. ఆ రాజేష్‌ను మాత్రం పోలీసులు అదుపులోకి తీసుకొనే ప్రయత్నం చేస్తారా అనేది చూడాలి. ఇక, గురువారం డాయ్ యాప్ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఇందులో కీలక పాత్ర పోషించిన కొందరు ఆర్పీలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. బాధితులు ఇళ్ల వద్దకు వచ్చి గొడవ చేస్తారన్న అనుమానంతో వీరు ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి వెళ్లిపోయినట్లు బాధిత మహిళలు చెబుతున్నారు. ఇక, బాధితుల్లో కొందరు వార్డు స్థాయి నాయకుల వద్దకు చేరి తమకు ఎలాగైనా తాము పోగొట్టుకొన్న సొమ్ములు వచ్చేలా సాయం చేయాలని ప్రాధేయపడుతున్నారు. దీంతో వారు మున్సిపల్ అధికారులను కలిసి చర్చిస్తున్నారు. మరోవైపు కొందరు బాధితులు శుక్రవారం పలమనేరు సీఐ చంద్రశేఖర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. తాము మోసపోయిన ఉదంతంపై డీఎస్పీ విష్ణురఘువీర్‌కు బాధితులు మౌఖికంగా ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు వీరు ఫిర్యాదులు చేశారు.

సైబర్ క్రైం పరిధిలోకి కేసు

డాయ్ యాప్ ఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈకేసును తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని డీఎస్పీ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ డాయ్ యాప్‌లో భౌతికంగా కాకుండా.. ఆన్‌లైన్ పద్ధతిలో డిపాజిట్లు జరిగినట్లు తెలిసింది. అందుకని సైబర్‌క్రైం పోలీసుల సహకారంతో ఈ కేసు దర్యాప్తు చేయించనున్నట్లు తెలుస్తోంది.

పాడి రైతులకు సేవలందించాలి



మ్యాంగో భవన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు (సెంట్రల్), జూలై 26 : జిల్లాలోని పాడి రైతులకు అవసరమైన సేవలు అందించేలా సచివాలయ స్థాయిలో పశుసంవర్ధక సహాయకులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మ్యాంగో భవన్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 282 మంది పశుసంవర్ధక సహాయకులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో 5.50 లక్షల మంది రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో ఉంటూ పాడి పశువులు, జీవాల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల పెంపకం, షెడ్స్ స్కీంలకు అర్హులను గుర్తించాలన్నారు. జేడీ ప్రభాకర్, సహాయ సంచాలకులు, సహాయ సంచాలకులు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

మ్యాంగోభవన్ పరిశీలన

మ్యాంగోభవన్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. వసతులు, ప్రయోగశాల, విదేశీ ఎగుమతుల కోసం చేస్తున్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పండ్ల పరిశ్రమ సమాఖ్య సభ్యుడు, సంస్థ కార్యదర్శి కట్టమంచి బాబీ ఆధ్వర్యంలో మామిడి గుజ్జు పరిశ్రమల్లో ఎదురవుతున్న సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

కొబ్బరికాయల వ్యాపారి కిడ్నాప్ సుఖాంతం

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

భాకరాపేట/తిరుపతి(నేరవిభాగం),జూలై 26: తిరుపతికి చెందిన వ్యాపారి కిడ్నాప్ కథ చివరకు సుఖాంతమైంది. చిన్నగొట్టిగల్లు మండలం చెరువు ముందరపల్లెకు చెందిన భాస్కర కొన్ని సంవత్సరాలుగా తిరుపతిలోని మంగళం ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. కొబ్బరికాయల వ్యాపారం చేస్తున్న ఈయన ఆటో కూడా నడుపుతుంటాడు.సొంత పనుల నిమిత్తం బుధవారం స్వగ్రామానికి వచ్చి తిరిగి తిరుపతికి వెళుతూ మార్గమధ్యంలోని చిన్నగొట్టిగల్లు వద్ద కిడ్నాప్ అయ్యాడు.తన కుమారుడు రెడ్డికిరణ్‌కు వాట్సప్ కాల్ చేసి తాను కిడ్నాపర్ల చెరలో వున్నట్లు తెలియ జేశాడు.రెడ్డికిరణ్ వెంటనే భాకరాపేట పోలీసులకు కిడ్నాప్ విషయం తెలిపాడు.రంగంలోకి దిగిన పోలీసులు ఫోన్ నెంబరు ఆధారంగా కిడ్నాపర్లు వెళుతున్న వాహనం లోకేషన్‌ను గుర్తించి పీలేరు సమీపంలో వెంబడించారు. పోలీసుల రాకను గుర్తించిన నలుగురు కిడ్నాపర్లు వారి వాహనాన్ని ఢీకొట్టి తిరుపతి వైపు పారిపోతుండగా చంద్రగిరి మండలం కాలూరు క్రాస్ వద్ద మరో పోలీసు బృందం కిడ్నాపర్లను అటకాయించింది.ఇదే సమయంలో కిడ్నాపర్ల వాహనం టైరు పంక్చర్ కావడంతో పోలీసులకు దొరికిపోయారు.కిడ్నాపర్ల ముఠాలో చిన్నగొట్టిగల్లుకు చెందిన జిషామ్‌తో పాటు బెంగళూరుకు చెందినవారున్నారని సమాచారం. ఎర్రచందనం స్మగ్లింగుతో కిడ్నాపర్లకు సంబంధమున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.ఆర్థిక లావాదేవీలే కిడ్నాప్‌కు కారణమని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.కిడ్నాప్ ఘటనకు సంబంధించి తిరుచానూరు స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదై భాకరాపేట పోలీసులకు బదిలీ చేయబడింది.ఎస్పీ సుబ్బరాయుడి పర్యవేక్షణలో భాకరాపేట సీఐ మస్తాన్‌వలి, ఇన్‌చార్జ్ ఎస్ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో ఈవో తనిఖీలు

భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా



తిరుమల, జూలై26(ఆంధ్రజ్యోతి): వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను ఈవో శ్యామలరావు శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు పంపిణీ తదితర విషయాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులను దర్శనానికి అనుమతించేటప్పుడు గేట్లు తెరవడం, కంపార్టుమెంట్లలో పారిశుధ్య చర్యలు, పెద్ద స్ర్కీన్‌లలో ప్రసారం అవుతున్న ఎస్వీబీసీ కార్యక్రమాలు, వివిధ భాషలలో భక్తులకు అందిస్తున్న సమాచారం తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అంతకుముందు గోకులంలో శ్రీవాణిట్రస్టు ద్వారా భక్తులకు కేటాయిస్తున్న టికెట్ల జారీని ఈవో పరిశీలించారు. శ్రీవాణి ట్రస్టు భక్తులకు మరింత సౌకర్యవంతంగా టికెట్లు జారీ చేయాలన్నారు. ఇందుకోసం గోకులం వెనుకభాగంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం దాతల విభాగం పక్కనే ఉన్న ఆదిశేష విశ్రాంతి గృహంలో తాత్కాలిక శ్రీవాణిట్రస్టు దర్శన టికెట్ల జారీ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డీఎఫ్‌వో కార్యాలయంలో పూర్తిస్థాయిలో శ్రీవాణి టికెట్ల జారీ కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో టికెట్లు జారీ కౌంటర్లు, 200 మంది భక్తులు వేచిఉండేందుకు సీటింగ్, పార్కింగ్, మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తర్వాత ఈవో శ్రీవారి ఆలయ పరిసర ప్రాంతాలను, తిరుమలనంబి ఆలయం, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. ఈవోతో పాటు జేఈవో వీరబ్రహ్మం, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో లోకనాథం, ఎలక్ట్రికల్ డీఈ రవిశంకర్‌రెడ్డి, వీజీవో నందకిషోర్, ఇతర అధికారులు ఉన్నారు.

డబ్బు కోసం ఫ్రెండ్‌కే వల!

● బ్లాక్‌మెయిల్ కేసులో లా విద్యార్థులైన దంపతులకు రిమాండు

తిరుపతి (నేరవిభాగం/విశ్వవిద్యాలయాలు),జూలై26: తిరుపతిలో ఓ లా విద్యార్థిని సస్పెండయ్యారు. ప్రస్తుతం ఐదేళ్ల లా ఇంటిగ్రేటెడ్ ఏడవ సెమిస్టర్ చదువుతూ బ్లాక్ మెయిల్ కేసులో ఇరుక్కున్న ఆమెను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా ఎర్రావారిపాలేనికి చెందిన కృష్ణకిషోర్ రెడ్డి తిరుపతిలోని పుదిపట్లలో వుంటూ బీఎల్ చదువుతున్నాడు. తమిళనాడుకు చెందిన ఈయన భార్య సదాశివం ప్రణవ్ కృష్ణ కూడా బీఎల్ ఫైనల్ ఇయర్ చదువుతోంది.డబ్బు సంపాదన కోసం తన సహాధ్యాయి అయిన కర్నూలుకు చెందిన మహిళతో ప్రణవ్ కృష్ణ పరిచయం పెంచుకుంది.తన ఇంటికి తీసుకెళ్ళింది.కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి ఇచ్చింది. ఆమె మత్తులో వున్నప్పుడు భర్త కృష్ణకిషోర్‌తో కలిపి అసభ్య ఫొటోలు,వీడియోలు తీసింది.వాటిని ఆ మహిళతో పాటు ఆమె అన్నకు, కాబోయే భర్తకు వీడియోలు, ఫొటోలు తీసి పంపింది. భర్తతో కలిసి పెద్దఎత్తున డబ్బులు డిమాండు చేసింది. పదే పదే వేధిస్తుండడంతో బాధిత మహిళ శుక్రవారం ఎంఆర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నాగేంద్రబాబు కేసు నమోదు చేశారు. నిందితులైన దంపతులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

10 మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

ఆరు దుంగలు, రెండు కార్లు స్వాధీనం



స్మగ్లర్ల వివరాలు తెలియజేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, జూలై 26: టాస్క్‌ఫోర్స్ పోలీసులు పది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆరు దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ కె.కృపానంద, ఆర్ఎస్ఐ కె.సురేష్ బాబుకు చెందిన బృందం దొరవారిసత్రం-నాయుడుపేట అటవీ ప్రాంతంవైపు శుక్రవారం కూంబింగ్ చేపట్టారు. అక్కడినుంచి సూళ్లూరుపేట బీటు పరిధిలోని తల్లంపాడు గ్రామం సమీపంలో ఉన్న జాతీయ రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అటువైపు వచ్చిన రెండు కార్లు వీరిని చూసి కొద్దిదూరంలోనే ఆపేసి, అందులోని వారు పారిపోయే ప్రయత్నం చేశారు. గమనించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంబడించి పది మంది పట్టుకున్నారు. వీరు.. తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన రాజమణి గోవిందస్వామి (41), విజయకుమార్ (32), శివకుమార్ వెల్లియన్ (26), కుమార్ ముత్తు (29), అరుల్ ముత్తుస్వామి (23), ప్రభు రాజి (25), అశోక్ కుమార్ (29), ఎం.గోపి (26), జ్ఞానశేఖర్ చిన్నతంబి (19), పూవరాసన్ వరదన్ (27)గా గుర్తించారు. పరారైన మిగిలిన వారికోసం గాలిస్తున్నారు. అలాగే కార్లలోని ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, వాహనాలను సీజ్ చేశారు.

జూపార్కు వద్ద మరో ముగ్గురి అరెస్టు: ఏడు దుంగల స్వాధీనం

జూపార్కు ప్రహరీ వద్ద మరో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఏడు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ(ఆపరేషన్స్) సురేష్‌కుమార్ రెడ్డికి చెందిన విశ్వనాథ్ బృందం గురువారం సాయంత్రం నుంచి శ్రీవారి మెట్టు పార్కింగ్ నుంచి జూపార్కు వైపు కూంబింగ్ చేపట్టారు. జూపార్కు ప్రహరీ వద్ద కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ తారసపడ్డారు. అదేసమయంలో టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి స్మగ్లర్లు కారును వదలి పారిపోయారు. కారులో చూడగా నాలుగు ఎర్రచందనం దుంగలు కనిపించాయి. వాటితోపాటు కారును స్వాధీనం చేసుకున్నారు. అలాగే తిరుమల రెండో ఘాట్‌లోని 36వ కల్వర్టు వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా, జూపార్కు వద్ద పరారైన స్మగ్లర్లను గుర్తించారు. అనంతరం వీరు సమీపంలో దాచి ఉంచిన మరో మూడు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన గోపి అయ్యాకన్ను(26), శివరాజ్ మాణిక్యం(39), గోవిందరాజ్(32)గా గుర్తించారు. ఈ రెండు కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి.. సీఐ శ్రీనివాసులు, సురేష్‌కుమార్‌లు దర్యాప్తు చేపట్టారు.

ఎస్ఎస్‌డీ సంస్థ పేరుతో రూ.5లక్షల డిమాండ్

● తిరుపతి ఎస్పీకి ఫిర్యాదు చేసిన డీఎంహెచ్‌వో

తిరుపతి(వైద్యం), జూలై 26: సమతా సైనిక్ దళ్(ఎస్ఎస్‌డీ) సంస్థ పేరుతో బెదిరింపులకు గురి చేస్తూ రూ.5లక్షలు డిమాండ్ చేస్తున్నారంటూ డీఎంహెచ్‌వో శ్రీహరి శుక్రవారం తిరుతి ఎస్పీ సుబ్బరాయుడికి ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా కల్యాణ్, సుబ్రహ్మణ్యం, నాగేంద్రలు ఎస్ఎస్‌డీ సంస్థ పేరుతో తనను నగదు డిమాండ్ చేయడంతోపాటు ఇవ్వకుంటే తప్పుడు ప్రచారాలకు తెరలేపుతామని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పైగా నేరుగా ఇంటికొచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు.దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు కూడా ఎస్పీకి అందజేసినట్లు శ్రీహరి తెలిపారు.

ఫిర్యాదు చేసినందుకు కేసు పెట్టారు

వైద్య ఆరోగ్య శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీహరిపై సమతా సైనికదళ్ సంస్థ తరపున కలెక్టర్‌కు, హెల్త్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినందుకు తనపై అక్రమ కేసులు పెడుతున్నారని, సమతా సైనికదళ్ జిల్లా కార్యదర్శి గండికోట సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము డీఎంహెచ్‌వోను ఎలాంటి నగదు డిమాండ్ చేయలేదని పేర్కొన్నారు.

ఆలయ ముఖద్వారాన్ని ఢీకొన్న లారీ

ఆర్చి దిమ్మె సహా ఏడు కిలోమీటర్లు వెళ్లాక ఆపేసి పరారైన డ్రైవరు



ధ్వంసమైన ఆలయ ముఖద్వారాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ, స్థానికులు



ఆర్చి దిమ్మె సహా వచ్చిన లారీ

కల్లూరు, జూలై 26: పులిచెర్ల మండలం కల్లూరు-పీలేరు జాతీయ రహదారి ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ముఖద్వారాన్ని శుక్రవారం వేకువజామున లారీ ఢీకొంది. పీలేరు మండలం అగ్రహారంలో ఉన్న ఈ ఆలయానికి సంబంధించి ముఖద్వారాన్ని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద నిర్మించారు. అగ్రహారం వైపు నుంచి జాతీయ రహదారి వైపు చింతగింజల పొడి లోడుతో వస్తున్న లారీ శుక్రవారం వేకువజామున మూడు గంటల ప్రాంతంలో ఈ ఆర్చిని ఢీకొంది. ముఖద్వారం పైభాగం సహా లారీ కల్లూరు వైపు సుమారు 7 కిలోమీటర్ల దూరం వచ్చాక.. రోడ్డు సమీపంలోని చింతచెట్టు వద్ద ఆపేసి డ్రైవర్ వెళ్లిపోయారు. ఉదయం చూసిన స్థానికులు కల్లూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీట్ సీట్ల కేటాయింపు డిజిటల్ సమాచారం సిద్ధం

తిరుపతి(విద్య), జూలై 26: నీట్ సీట్ల కేటాయింపుకు సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ బుక్‌లెట్ రూపంలో సిద్ధం చేసినట్టు తిరుపతిలోని ఐఐటీ, జేఈఈ నీట్ ఫోరం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. నీట్-2024 పరీక్ష రాసిన విద్యార్థులకు సీట్ల కేటాయింపుపై ఓ అవగాహనకోసం నీట్-2023 సీట్ల కేటాయింపు జరిగిన సమాచారాన్ని ఇందులో పొందుపరిచినట్టు వెల్లడించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ రౌండ్ 1, రౌండ్ 2, మాప్ అప్ రౌండ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ర్యాంకు, రిజర్వేషన్ వారీగా సీట్ల కేటాయింపును క్రోడీకరించి బుక్‌లెట్‌ను సిద్ధం చేసినట్టు వివరించారు. ఈ బుక్‌లెట్‌కోసం, మరింత సమాచారం కోసం నీట్ సీట్ అని టైప్ చేసి 98490 16661 నెంబరుకు వాట్సాప్ మెసేజ్ పంపాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

పుంగనూరు, జూలై 26: పుంగనూరు ఎన్ఎస్‌పేటలోని రామ్‌నగర్ కాలనీలో పోలీసులు రూ.1.57లక్షలు విలువైన కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. సీఐ జయరామయ్య కథనం మేరకు.. స్థానిక రామ్ నగర్‌లోని మహ్మద్ ఇద్రాస్ (17) ఇంటర్ ఫెయిలయ్యాడు. ఖాళీగా ఉండేవాడు. ఎన్ఎస్‌పేటకు చెందిన అబ్రీ తల్లిదండ్రులు బెంగళూరులో కూలి చేసుకుని జీవిస్తున్నారు. అబ్రీ పుంగనూరులో ఒక్కడే ఉండేవాడు. ఇతడు జూదానికి, మద్యానికి బానిసయ్యాడు. డబ్బుకోసం పలుచోట్ల మోటారు సైకిళ్ల చోరీచేసిన కేసులో నిందితుడు. ఈ క్రమంలో మహ్మద్ ఇద్రాస్, అబ్రీ మధ్య పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి కర్ణాటక మద్యం తక్కువకు తెచ్చి ఇక్కడ ఎక్కువకు విక్రయించేవారు. ఈ క్రమంలో మహ్మద్ ఇద్రాస్ తమ ఇంటి మిద్దెపై వాటర్ ట్యాంకు కింద కర్ణాటక మద్యం దాచి ఉంచాడు. రహస్య సమాచారంతో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. మద్యం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో నీటి కష్టాలు

● నాలుగు నెలల క్రితం బోరులో తగ్గిన నీరు ● ఇబ్బంది పడుతున్న రోగులు


ఆసుపత్రిలో ఎండిపోయిన నీటి బోరు

తంబళ్లపల్లె, జూలై 26: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి(సీహెచ్‌సీ)లో నీటి కష్టాలు తీవ్రతరమవుతున్నాయి. ఆసుపత్రిలో ఉన్న బోరులో నీరు తగ్గిపోవడంతో నాలుగు నెలల నుంచి నీటి సమస్య ఏర్పడింది. దీంతో నిత్యం వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు, ఇన్‌పేషంట్లు, వారి సహాయకులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి మండలం నుంచే కాకుండా పొరుగు మండలాలైన పెద్దమండ్యం, ములకలచెరువు నుంచి రోజుకు సుమారు వంద మంది వరకు వైద్య సేవల కోసం అవుట్ పేషంట్లు వస్తుంటారు. గర్భిణులు, బాలింతలు, వారి సహాయకులు సుమారు 20 మందికి పైగా ఇన్‌పేషంట్లు ఆసుపత్రిలో సేవలందుకుంటుంటారు. వారితో పాటు ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది దాదాపు 30 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆసుపత్రిలో ల్యాబ్, క్లీనింగ్, మరుగుదొడ్ల వినియోగం, తదితర అవసరాలకు కలిపి దాదాపు రోజుకు ఒక ట్యాంకరు పైగా నీరు అవసరమవుతుంది. అయితే నాలుగు నెలల కిందట ఆసుపత్రికి నీరు అందించే బోరులో నీరు పూర్తిగా తగ్గిపోవడంతో నీటి సమస్య ఏర్పడింది. ఇదిలా ఉండగా ఆస్పత్రి వైద్యాధికారి సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటిని తోలిస్తున్నా సరిపోవడం లేదు. దీంతో ఆసుపత్రిలో నీటి ఎద్దడి నెలకొని మరుగుదొడ్లకు నీటి సరఫరా లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం వైద్య సేవల కోసం ఆసుపత్రికి వెళ్లిన మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ అక్కడ నెలకొన్న నీటి సమస్యను గుర్తించి సిబ్బందిని ప్రశ్నించింది. స్థానిక టీడీపీ నాయకులు క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, గంగులరెడ్డి, పురుషోత్తం, సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, స్వామిరెడ్డిలు విషయాన్ని తెలుసుకుని రోగులకు ఇబ్బంది కలుగకుండా అధికారులు స్పందించి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆస్పత్రి వైద్యాధికారి వెంకట్రా మయ్యకు వినతి పత్రం అందచేశారు.


వైద్య సేవల కోసం వచ్చిన రోగులు

పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



ఆసుపత్రిలో ఉన్న బోరు నాలుగు నెలల కిందట ఎండిపోవడంతో సొంత నిధులతో తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని తోలిస్తున్నాం. అయితే ప్రస్తుతం రోగులు ఎక్కువగా వస్తున్నందున ఈ నీరు చాలడం లేదు. ఈ విషయాన్ని తమ వైద్యశాఖ ఉన్నతాధికారులతో పాటు పలుమార్లు ప్రభుత్వాసుపత్రుల మౌలిక వసతులు పర్యవేక్షించే ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్‌ఐడీసీ) డీఈ, ఏఈల దృష్టికి తీసుకెళ్లాము. ఏపీఎంఎస్ ఐడీసీ వారు నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ సమస్యను పట్టించుకోకపోవడంతో.. జూన్ 10వ తేదీన ఈఈకి వినతిపత్రాన్ని మెయిల్ ద్వారా పంపించాం. దీంతో డీఈ, ఏఈ, జియాలజిస్ట్ వచ్చి ఆసుపత్రిలో ఉన్న బోరును పరిశీలించి నీరు తగ్గిపోయిందని..నూతన బోరు వేయాలని పాయింట్ పెట్టి వెళ్లిపోయారు. అంతే అప్పటి నుంచి ఇంతవరకు సమస్యను పట్టించుకోలేదు.

- వెంకట్రామయ్య, వైద్యాధికారి, తంబళ్లపల్లె సీహెచ్‌సీ

మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా మేఘస్వరూప్ బాధ్యతలు స్వీకరణ


సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్నమేఘస్వరూప్

మదనపల్లెటౌన్, జూలై26:మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన మేఘస్వరూప్ శుక్రవారం రాత్రి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు మదనపల్లె ఆర్డీవోగా ఇక్కడ పనిచేస్తున్న హరిప్రసాద్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో బదిలీపై సబ్‌కలెక్టరక్‌గా మేఘస్వరూప్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో సబ్‌కలెక్టర్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి పారదర్శకంగా పాలన అందిస్తామన్నారు. డివిజన్‌లోని 11 మండలాల ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ పథకాల అమలుకు కృషి చేస్తామన్నారు.

వెంకయ్యనాయుడు గొప్ప దార్శనికుడు


వెంకయ్యజీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె టౌన్, జూలై 26: భారత మాజీ ఉపరాష్ట్రపత్రి వెంక య్యనాయుడు గొప్ప దార్శినికుడని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో బీజేపీ జాతీయ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, విజయ భారతి సేతు ఆధ్వర్యంలో సంజయ్‌కిశోర్ రచించిన వెంకయ్యనాయుడు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహు భాషా కోవిదుడు వెంకయ్యనాయుడు వాగ్ధాటితో ప్రపంచ దేశాలను కూడా ఆకర్షించారన్నారు. ఉప రాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చిన వ్యక్తి వెంకయ్యనాయుడు అని కీర్తించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు డాక్టర్ అజ్మతుల్లా, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

రామసముద్రం, జూలై 26: రెవెన్యూ సిబ్బంది భూ సంబంధిత విషయాలలో అప్రమత్తంగా ఉంటూ బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డీటీ, వీఆర్వోలు, ఆర్ఐ, సర్వేయర్‌లతో తహసీల్దార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీకేటీ, పట్టాభూమి తదితర దస్త్రాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం విమర్శలకు తావు లేకుండా పనిచే యాలన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేయించా లన్నారు. సమావేశంలో, డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ రెడ్డెప్ప, వీఆర్వోలు భార్గవి, రెహ్మాన్, రఘురామ్, జగదీష్, శ్రీని వాసులు, అశ్వని, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూములను పరిశీలించి నివేదిక ఇవ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అనీల్‌కుమార్

ములకలచెరువు, జూలై 26: ఫ్రీహోల్డ్ భూములను పునఃపరిశీలించి నివేదికలు ఇవ్వాలని తహసీల్దార్ అనీల్‌కుమార్ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వీఆర్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పునఃపరిశీలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యాలయంలో రికార్డులు, పత్రాలను భద్రంగా ఉంచాలన్నారు. రికార్డుల భద్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవ న్నారు. ఈ సమావేశంలో డీటీలు హరికుమార్, లక్ష్మి, ఆర్ఐ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి భూమిని కాపాడండి

● బాధితురాలు వేడుకోలు

మదనపల్లె అర్బన్, జూలై 26: భూ ఆక్రమణదారుల నుంచి భూమిని కాపాడి తమకు న్యాయం చేయాలని బాధితురాలు శాంతిప్రియా ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ బి.కొత్తకోట మండలం, కోటావూరు రెవెన్యూ గ్రామ సర్వేనెంబరు 386లో 1ఎకరా 25 సెంట్లు భూమిలో 48 సెంట్లు భూమి మాకు హక్కు ఉందన్నారు. ఇది నేషనల్ హైవేప్రక్కనే ఉండడంతో ఆదే సర్వేనెంబరులో సగ భాగస్తులైన టి. నారాయణ, టి.వెంకటేష్, టి. కృష్ణమూర్తి, టి. హరికృష్ణ, టి. నాగరాజు, టి. సుధాకర్ అనే వ్యక్తులు తమ వాటా 48 సెంట్లు భూమిని ఆక్రమించుకుని తమపై దౌర్జనం చేస్తున్నారని వాపోయింది. అంతేగాకుండా ఏఎస్ఐ ఎదుటే తమను చంపేస్తామని బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై బి.కొత్తకోట పోలీసులకు, మదనపల్లె డీఎస్పీకి, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని అందుకే తమను చంపడానికి ప్రయత్నం చేస్తున్నారని పత్రికాముఖంగా వాపోయారు. వారి వలన తనకు, తనభర్తకు ప్రాణహానీ ఉందని అలాంటి సంఘన ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యత అవుతుందని ఆమె పేర్కొన్నారు.

కార్గిల్ అమరవీరుల త్యాగాలు మరవలేనివి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న పీలేరు విద్యార్థులు


కురబలకోటలో నివాళులర్పిస్తున్న దృశ్యం

కురబలకోట, జూలై 26: కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల డీన్ తులసీరామ్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరోచితంగా పోరాడి సైనికులు తమ ప్రాణాలను అర్పించారని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ నవీన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

పీలేరులో: పీలేరులోని పలు విద్యాసంస్థల్లో కార్గిల్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ .సుధాకర్ రెడ్డి మాట్లాడుతూమన దేశ సైనికుల వీరత్వానికి ప్రతీకగా కార్గిల్ యుద్ధం నిలిచిందన్నారు. ఆ యుద్ధంలో వందలాది మంది సైనికులు ప్రాణత్యాగం చేసి మన భూభాగాన్ని కాపాడారన్నారు. ఆ సైనికుల వీర పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి విద్యార్థులు దేశం కోసం పాటుపడాలన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరసైనికులకు సంబంధించిన డాక్యుమెంటరీలను కళాశాల తెలుగు అధ్యాపకులు శ్రీనివాసులు రెడ్డి నేతృత్వంలో విద్యార్థులకు అవగాహన కోసం ప్రదర్శించారు. పాత బస్టాండులోని జడ్పీ మెయిన్ పాఠశాలలో కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరులకు కొవ్వొత్తుల ప్రదర్శన ద్వారా నివాళులర్పించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ కవెంకటరమణయ్య, ఎంఈవో లోకేశ్వర్ రెడ్డి, ఎస్ఐ రమణ, మెయిన్ స్కూల్ హెచ్ఎం సురేంద్రనాథరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ జయపాల్‌రెడ్డి, క్యాడెట్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: స్థానిక సొసైటీ కాలనీలోని విజయభారతీ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్‌లో శుక్రవారం కార్గిల్ విజయ దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కార్గిల్‌లో విజయం సాధించిన భారత సైనికులు చిత్రపటాలకు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ సేతు, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు బండి ఆనంద్, గుడ్‌విల్ కంప్యూటర్స్ వ్యవస్థాపకుడు అజయ్‌లు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పీటీఎంలోని బస్టాండులో కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ల చిత్రపటాలకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను అర్పించిన అమర వీరులను గుర్తించుకుని వారికి నివాళులర్పించడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బీజేపీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి శివయ్య, టీడీపీ నాయకులు నందిమూర్తి, రామకృష్ణ, కిరణ్‌కుమార్, జనసేన నాయకులు ముద్దసాని నాగ రాజు, గౌండర్ రెడ్డెప్ప, ఆంజనేయులు, హోటల్ మంజు, శివన్న పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నిమ్మనపల్లి, జూలై 26: సీజనల్ వ్యాధులపై గొర్రెలు మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం ముష్టూరు పంచాయతి యర్రప్పగారిపల్లిలో గొర్రెల పెంపక రైతులకు సీజనల్ వ్యాధులపై అయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు నీలి నాలుక జబ్బులకు గురైతే వెంటనే వైద్యం అందించక పోతే మరణిస్తాయన్నారు. అనంతరం గొర్రెలకు టీకాలు వేసి పెరుగు మందును తాపించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు మదనపల్లె విద్యార్థి

మదనపల్లె టౌన్, జూలై 26: అస్సాంలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ జట్టులో మదనపల్లెకు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు దిలీప్, మురళీధర్ తెలిపారు. మదనపల్లె మండలం సిద్దమ్మగారిపల్లెకు చెందిన హరిబాబు కుమారుడు డి.నరేష్ ఇటీవల అన్నమయ్య జిల్లా జూనియర్ టీములో ప్రతిభ కనపరిచాడన్నారు. అనంతపురం ఆర్డీటీలో శిక్షణ తీసుకున్న నరేష్ రాష్ట్ర ఫుట్‌బాల్ జూనియర్ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. ఈనెల 27న అస్సామ్‌లో నిర్వహించే ఏఐఎఫ్ఎఫ్ టోర్నమెంట్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు.

ఇంటర్ పాఠ్య పుస్తకాలు పంపిణీ

పెద్దమండ్యం, జూలై 26: పెద్దమండ్యం ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్మీడియట్ పాఠ్య పుస్తకాలను ఎంఈవో రామకృష్ణ పంపిణీ చేశారు. పెద్దమండ్యం మోడల్ కాలేజీ, కలిచెర్ల జూనియర్ కాలేజీ, సిద్దవరం కస్తూర్బా పాఠశాలల అధ్యాపకులకు ఎంఈవో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్‌లు రామాంజులు నాయక్, రాణి, అమరేంద్రకుమార్, అధ్యాపకులు ముస్తఫా, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్

బి.కొత్తకోట, జూలై26: బి.కొత్తకోట మండల పరిధిలోని బడికాయలపల్లె శివారు లోంచి అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు టాక్టర్లను శుక్రవారం పోలీసులు సీజ్ చేశారు. ఇసుక తరలుతున్నట్లు సమాచారం రావడంతో రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని అనుమతులు లేని కారణంగా ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించగా నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు, జూలై 26: జిల్లాలోని పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో ఆయనను కలిసిన యూనియన్ నాయకులు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని అనేక మంది పారిశుధ్య, స్వచ్ఛభారత్ కార్మికులను అకారణంగా తొలగించారని, వారినందరినీ తిరిగి విధుల్లోకి తీసుకునే విధంగా చొరవ చూపాలని వారు కోరారు. అనంతరం వారు కలెక్టర్‌ను సన్మానిం చారు. ఈ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య, జిల్లా అధ్యక్షుడు శేఖర్ నాయక్, ప్రధాన కార్యదర్శి సురేంద్ర బాబు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి కలికిరి ఎల్లమ్మ జాతర


విశేషాలంకరణలో ఎల్లమ్మ

కలికిరి, జూలై 26: భక్తుల కోర్కెలు తీర్చే శక్తి స్వరూపిణిగా పేరుగాం చిన కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ జాతర శనివారం ప్రారంభం కానుంది. వరుసగా నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఎల్లమ్మ జాతర కోసం చాటింపు, సోలెం ఊరేగింపులు పూర్తయ్యాయి. శనివారం జాగరణ, అమ్మవారి కథా కాలక్షేపంతో జాతర ప్రారంభ కానుంది. ఆదివారం ఉదయం ప్రత్యేక రథంలో అమ్మవారు గ్రామోత్సవంలో భాగంగా పట్టణంలో ఊరేగనున్నారు. సాయంకాలం సిద్ధ పూజల అనంతరం భక్తులు బోనాలు చెల్లించడం ద్వారా మొక్కులు తీర్చుకోనున్నారు. రాత్రికి చాందినీ బండ్ల ప్రదర్శన జరుగుతుంది. ఎల్లమ్మ జాతర సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపడానికి ఏర్పాట్లు చేస్తోంది. అదే విధంగా జాతరలో తగిని బందోబస్తు కోసం పొరుగు మండలాల నుంచి పోలీసులను రప్పిస్తున్నారు.

ఒత్తి-పత్తి అలంకరణలో కన్యకా పరమేశ్వరి



పీలేరు, జూలై 26: పీలేరు నెహ్రూబజారులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు శుక్రవారం ఒత్తి-పత్తి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసం 3వ శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు చంద్రశేఖర శర్మ అమ్మవారికి విశేష అలంకరణతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒత్తి-పత్తి అలంకరణలోని అమ్మవారిని పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ సభ్యులు పెద్దఎత్తున దర్శించుకుని పూజలు చేశారు.

వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు


శాకాంబరి అలంకరణలో వాసవీ అమ్మవారు

పెద్దతిప్పసముద్రం జూలై 26 : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన వాసవీ అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్యులు శుక్రవారం తమ కులదేవత అయిన వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ఉదయం నుంచి ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి అమ్మవారిని ఆర్యవైశ్యులందరు కలిసి శాకాంబరి అలంకరణలో ఆలయంలో కొలువు దీర్చి పూజలు నిర్వహించారు. అర్యవైశ్యులందరు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. అర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేషపూజలు

మదనపల్లె అర్బన్, జూలై26: కోర్టు ఆవరణలో వెలసిన కోర్టుల గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయక మిటీ అధ్యక్షుడు మార్వారి చిన్నటరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి మార్వారి ప్రభాకర్ నాయుడు, రంగాస్వామి నాయుడు, కరుణాకర్ నాయుడు, మార్వారి మహేష్, మార్వారి విక్కి, దేవేంద్ర, బోయపాటి శ్రీనివాసులు నాయుడు, ఉపాండ్ల కృష్ణకుమారి పర్యవేక్షించారు.

29 నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు

వాల్మీకిపురం, జూలై 26: వాల్మీకిపురం పట్టణంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామికి ఈనెల 29, 30 తేదీల్లో అత్యంత వైభవంగా ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించనున్నారు. సిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివా సాచార్యులు మాట్లాడుతూ 29న సాయం త్రం 6గంటలకు స్వామి వారికి విశేష అభిషేకాలు 30న కాలా భిషేకం జరుగుతుందని వివరించారు.

సీటీఎం క్రాస్‌లోని అక్రమాలను నిగ్గు తేల్చాలి

● సిసోడియాకు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ, జనసేన నాయకులు

మదనపల్లె టౌన్, జూలై 26: మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌రోడ్డు పంచాయతీలో ఇటీవల జరిగిన అక్రమాలపై విచారించి నిగ్గుతేల్చాలని సీటీఎం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి చల్లా నరసింహులు, వై.భాస్కర్‌రెడ్డి స్పెషల్ చీఫ్ సెక్రటరి సిసోడియాను కోరారు. శుక్రవారం సిసోడియాను కలసిన అనంతరం టీడీపీ నాయకులు సీటీఎంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీటీఎం క్రాస్‌లో వైసీపీ నాయకులు జగనన్న ఇళ్ల పథకం కింద అనర్హులకు, ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించారని ఆరోపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయకుండా డబ్బులు ఇచ్చిన వారికే ఇళ్ల స్థలాలు కేటాయించడమే కాకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. ఈ గ్రామ పరిధిలో ప్రైవేటు కళాశాల పక్కన వేసిన లేఅవుట్‌లో ప్రజాప్రయోజనాల కోసం వదలిన స్థలాన్ని కొందరు ఆక్రమించారన్నారు. వైసీపీ బడా ప్రజాప్రతినిధుల పేరు చెప్పుకుని ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఆక్రమించారన్నారు. మూడేళ్లలో పలు అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులపై విచారించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని సిసోడియాకు వినతి పత్రం ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు మాజీ సర్పంచ్ రెడ్డిరామ్ ప్రసాద్, వేమన్న, రాజు, భాస్కర్, భాను, శివ పాల్గొన్నారు.

ప్రజాప్రయోజనాల స్థలంలో అక్రమ నిర్మాణాలు

● సబ్‌కలెక్టరేట్‌లో ఫిర్యాదుచేసిన గుర్రంకొండ ప్రజలు


మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన గుర్రంకొండ టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, జూలై 26: గుర్రంకొండ మండలం చిట్టిబోయినపల్లెలో పదేళ్ల క్రితం ఇందిరమ్మకాలనీలో ప్రజాప్రయోజనాల కోసం వదలిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టారని గుర్రంకొండ టీడీపీ నాయకులు, ప్రజలు మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు శుక్రవారం సబ్‌కల్టెరేట్ వద్ద వారు మాట్లాడుతూ పదేళ్ల క్రితం 618 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించగా, మిగిలిన స్థలంలో ప్రజల సౌకర్యం కోసం రెవెన్యూ అధికారుల సహకారంతో అక్కడ ఆలయం, మసీదులు నిర్మించామన్నారు. కాని కొందరు వైసీపీ నాయకులు 32 ప్లాట్లకు నకిలీ పట్టాలు సృష్టించి, అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనిపై విచారించి కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కాపాడాలని ఏవోకు వినతి పత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో గుర్రంకొండ మాజీ సర్పంచ్ నౌషాద్‌అహ్మద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో మిగులు సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్

కలికిరి, జూలై 26: పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి భర్తీ కాకుండా మిగిలిన సీట్లు నింపడానికి సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ నోటిఫికేషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గతంలో కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పించినవి కాకుండా ఇంకా కొన్ని సీట్లు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. 10వ తరగతిలో ఉత్తీర్ణులై పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరదలిచిన వారు నేరుగా ప్రవేశాలు పొందే అవకాశం కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. అనంతరం 31వ తేదీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలని సూచించారు. ఇతర సందేహాలు, వివరాలకు 95055 04200 లేదా 99662 09000 నంబర్లలో సంప్రదించాలని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రిన్సిపాల్ తెలిపారు.

జీవో 217 రద్దుతో మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు

● కూటమి ప్రభుత్వానికి జేఏసీ నేతల ధన్యవాదాలు



మాట్లాడుతున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా మత్స్యకారులజేఏసీ కన్వీనర్ రమణ

మదనపల్లె అర్బన్, జూలై 26: మత్స్యకారులకు నష్టం కలిగించేలా గత ప్రభుత్వం తెచ్చిన జీవో 217ను రద్దు చేస్తామని అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని ఉమ్మడి చిత్తూరు జిల్లా మత్స్యకారులు జేఏసీ కన్వీనర్ మడితం రమణ, ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి కృష్ణమూర్తిలు పేర్కొన్నారు. ఈ మేరకు వారు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జీవో నెంబరు 217ను తీసుకొచ్చి మత్స్యకారుల సొసైటీలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఇలాంటి కష్ట సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవోను రద్దు చేసి మత్స్యకారులకు తీపికబురు చెప్పడం తమ కుటుంబాల్లో వెలుగులు నింపడం హర్షణీయమన్నారు. 3,325 చిన్నతరహా సాగునీటి చెరువులు, 23,920 పంచాయతీ చెరువులు, 118 రిజర్వాయర్లు మత్స్యకారుల సొసైటీలకు దక్కనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రీయ వాల్మీకి ధర్మసమాజ్ దక్షిణ రాష్ట్రాల అధ్యక్షుడు గంపల గంగరాజు, సభ్యులు మురళీమోహన్, శ్రీనివాసులు, హరినాథ్, వెంకటేష్, వీరాంజనేయులు, మల్లికార్జున, హరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి


ఎంఈవోకు వినతిపత్రమిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 26:పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంక టేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు విశ్వాసం కోల్పోయి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయిపోతున్నాయని, వాటిని కాపాడే బాధ్యత ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. జీవో నెం.117 రద్దు చేయాలని, జీవో ఎంఎస్‌నెం. 55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని, ప్రీప్రైమరీతోపాటు 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలలలో నడపా లని కోరారు. మోడల్ స్కూల్‌లో కొవిడ్ సమయంలో మృతి చెందిన వారి వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గాలి రవీంద్ర, సుధాక ర్‌నాయుడు, పురం వెంకటరమణ, సుధాకర్, సుబ్రహ్మణ్యం, విజయకుమార్, పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


వెలుగు సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పెద్దమండ్యం, జూలై 26:మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలోని స్త్రీశక్తి భవనంలో పెద్దమండ్యం స్త్రీశక్తి భవనంలో వెలుగు సంఘాల సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణయ్య, ఏపీఎం మధుశేఖర్‌బాబులు మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో ప్రతి కుటుంబం స్త్రీనిధితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. వెలుగు సభ్యులు ఈ నిధులతో జీవాల పెంపకం, పాడి పరిశ్రమలతో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. మండలంలో 274 మంది వెలుగు సభ్యులకు గాను రూ.1కోటి 37 లక్షలు నిధులు పంపిణీ చేసినట్లు తెలిపారు. స్త్రీనిధి మేనేజర్ అమరావతి, సీసీ, సంఘమిత్రలు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

తంబళ్లపల్లె, జూలై 26: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎంపీడీవో క్రిష్ణమూర్తి సూచించారు. శుక్రవారం ఎంపీడీవో స్థానిక హైస్కూలును సందర్శించి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి మెనూ ప్రకారంగా భోజనం అందచేయాలని వంట నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అంటువ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయండి

మదనపల్లె టౌన్, జూలై 26: అంటువ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, జ్వరపీడితులను త్వరగా గుర్తించి వారికి రక్తపరీక్షలు నిర్వహించాలన్నారు. కాచిన తాగునీటిని చల్లార్చి తాగాలని, వేడిగా వున్న ఆహార పదార్థాలను తినాలని ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ సాల్మాన్, ప్రణీత్, సూపర్‌వైజర్ మహీ, ప్రభాకర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.